
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5




శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

సోమవారం 12 ఫిబ్రవరి 2024

సోమశిలలో 22.514 టీఎంసీల నీటి నిల్వ



అనంతసాగరం, ఫిబ్రవరి 11 : సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి 22.514 టీఎంసీలు నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2500, ఉత్తర కాలువకు 550, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు వారు వివరించారు.

అటు దూకుడు..

ఇటు అనిశ్చితి !

- స్పష్టతతో దూసుకుపోతున్న టీడీపీ అభ్యర్థులు
- వైసీపీలో ఎవరు ఉంటారో.. ఎవరు ఊడుతారో తెలియని అయోమయం
- వీపీఆర్ నిర్ణయంపై అభ్యర్థుల విజయావకాశాలు

నెల్లూరు, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కో(డ్)డి కూయకముందే జిల్లాలో రాజకీయ వేడి రాజుకుంది. ప్రధానప్రతిపక్షమైన టీడీపీ రెట్టింపు ఉత్సాహంతో దూకుడు పెంచుతోంది. కొత్తవారి చేరికలతో రోజురోజుకు బలం పుంజుకుంటోంది. వైసీపీలో పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. పార్టీలో ఏ నాయకుడు ఉంటాడో, ఏ నాయకుడు జారుకుంటారో తెలియక కేడర్‌లో గందరగోళం నెలకొంది. అభ్యర్థుల ప్రకటన పెను విస్ఫోటమై ఆ పార్టీ పునాదులను కదలించి వేస్తోంది. ఈ క్రమంలో ఆ పార్టీ నేతల్లో మునుపటి ఉత్సాహం, ధైర్యం కనిపించడం లేదు.

● ప్రచారంలో టీడీపీ జోరు

జిల్లాలో జరిగిన రా..! కదలిరా... కార్యక్రమం తరువాత పరిస్థితులు వేగంగా మారిపోయాయి. అభ్యర్థుల విషయంలో స్పష్టత రావడం, వారికి అధినేత గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నియోజకవర్గ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఉదయగిరి ఇన్‌చార్జి బొల్లినేని వెంకటరామారావు ఇంటింటి ప్రచారాన్ని ఉధృతం చేశారు. దీనికి తోడు వైసీపీలో ఉన్న అసంతృప్తివాదులను తనవైపునకు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీపరంగా, వ్యక్తిగతంగా చేసిన సర్వేలు అనుకూలంగా రావడంతో ఆయన రెట్టింపు ఉత్సాహంతో ముందుకు కదులుతున్నారు. కావలి నియోజకర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన కావ్య కృష్ణారెడ్డి ఎన్నికల ప్రచారాన్ని మొదలు పెట్టారు. నియోజకవర్గ నాయకులను కలిసి వారి మద్దతు కూడగట్టుకోవడంతో పాటు వార్డులు, గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. కోవూరు ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిలు చెరోవైపు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. వివిధ కార్యక్రమాలు, ఆందోళనలతో ప్రజల్లోకి వెళుతున్నారు. వైసీపీలో ఉన్న అసంతృప్తవా దులను ఆకర్షిస్తున్నారు. నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పొంగూరి నారాయణ సతీసమేతంగా రాత్రింబవళ్లు నగరంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. గతంలో మంత్రి హోదాలో చేసిన అభివృద్ధి పనులు ఆయనకు వరంగా మారుతున్నాయి. రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతోంది. అదే సమయంలో వైసీపీలో చోటుచేసుకున్న పరిణామాలు నారాయణకు బాగా కలిసివస్తున్నాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కూడా కుటుంబ సమేతంగా నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. రూరల్ నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలసలు ప్రారంభమయ్యాయి. ఒకటి రెండు రోజుల్లో నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో చేరికలు ఉండబోతున్నాయి. సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పోరాటాల ద్వారా ప్రజల్లో పట్టు పెంచుకొంటున్నారు. క్వార్ట్జ్, కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ అంశాలపై సోమిరెడ్డి జరిపిన పోరాటంతో నియోజకవర్గంలో ఆయన గ్రాఫ్ పెరిగింది. ఈ నియోజకవర్గంలో కూడా వైసీపీ నుంచి పెద్ద ఎత్తున టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి.





● వీపీఆర్ కలకలం


చేరికలతో టీడీపీ ఉత్సాహంగా కనిపిస్తుంటే, వైసీపీలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి.ముఖ్యంగా జిల్లా పార్టీ అధ్య క్షుడు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి పార్టీ నుంచి పక్కకు జరగడంతో ఆ పార్టీ తీవ్ర సంక్షోభంలో పడిపోయింది. నెల్లూరు పార్లమెంట్‌కు పోటీ చేయనని ఆయన అధిష్ఠానానికి స్పష్టం చేయడంతోపాటు ఏకంగా పార్టీకే దూరం కావాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. తాను వద్దన్నా రెండేళ్లకు ముందే ఎంపీగా పోటీ చేయాలని ఒప్పించి, ఆ విషయాన్ని జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలందరికీ చెప్పి, ఎన్నికలు జరిగే సమయంలో ఉద్దేశపూ ర్వకంగా తన గెలుపు అవకాశాలను దెబ్బకొట్టాలని అధిష్ఠానం కుట్రపన్నడాన్ని ఆయన జీర్ణించుకోలేక పోతున్నారు. వీపీఆర్ పార్లమెంట్‌కు పోటీ చేయరన్న ప్రచారం జిల్లా వైసీపీని పెద్ద కుదుపే తీసుకొచ్చింది. ప్రధానంగా వైసీపీ అభ్యర్థుల్లో రెండు రకాల భయాలు పట్టుకున్నాయి. ఒకటి ఆర్థిక అండ దూరం కావడం, రెండోది అసమ్మతి బెడద. వీపీఆర్ వైసీపీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీచేసినా, లేక పోటీ నుంచి తప్పుకున్నా, ఈ రెండు నిర్ణయాలేకాక తన రాజకీయ భవిష్యత్తును మరో రాజకీయ పార్టీతో ముడిపెట్టుకున్నా...!!? నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని వైసీపీ అభ్యర్థుల ఫలితాలపై ఆ ప్రభావం పడుతుంది. అంతేకాక పలువురు వైసీపీ నాయకులు పార్టీ నుంచి జారుకునే అవకాశాలున్నాయి. ఇప్పటికే చాప కింద నీరులా ఆ ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. మొత్తం మీద అధికార పార్టీ హోదాతో ఉత్సాహంగా రంగంలోకి దిగాల్సిన వైసీపీ ప్రజల మద్దతు కూడగట్టుకోలేక, కొత్తవారిని చేర్చుకోలేక, పార్టీ నుంచి జారిపోతున్న పాతవారిని పట్టుకోలేక అల్లాడుతోంది.



అభ్యర్థుల ఆందోళన

- టెట్, డీఎస్సీ వెంటవెంటనే నిర్వహణపై అభ్యంతరం
- వచ్చేనెల 14న టెట్ ఫలితాలు, 15 నుంచి డీఎస్సీ
- ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని హడావిడి
- ప్రభుత్వం తీరుపై నిరుద్యోగుల మండిపాటు
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

నెల్లూరు (విద్య) / సంగం/ పొదలకూరు, ఫిబ్రవరి 11: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం తగినంత వ్యవధి ఇవ్వ కుండా టెట్, డీఎస్సీ నిర్వహించేందుకు సిద్ధం కావడంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేర్వేరు సిలబస్‌లు అయినందున రెండు పరీక్షల మధ్య కొంత సమయం ఉండాలి. కానీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేస్తోందన్న ఉద్దేశంతో ప్రభుత్వం వీటిని వెంటవెంటనే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నదని వారు మండిపడుతున్నారు. టెట్‌లో ఉత్తీర్ణులైనవారే డీఎస్సీ రాసేందుకు అర్హులు. అందువల్ల టెట్‌కు కూడా ప్రాధాన్యం ఉంది. అంతేకాక ఉపాధ్యాయ నియామకాల్లో టెట్ మార్కులకు 20 శాతం వరకు వెయిటేజ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో డీఎస్సీ రాసే అభ్యర్థులకు టెట్ అత్యంత కీలకం. టెట్‌కు హాజరుకానున్న అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ఈనెల 8 నుంచే ప్రారంభమైంది. ఈనెల 18లోగా దరఖాస్తు చేసుకుంటే 27 నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఫలితాలు వచ్చే నెల 14న విడుదల చేస్తారు. సాధారణంగా టెట్ ఫలితాలు వెలువడాక డీఎస్సీ పరీక్షకు షెడ్యూల్ ఖరారు చేయాలి. రెండు పరీక్షల మధ్య నెల నుంచి 45 రోజుల వ్యవధి ఉండాలి. కానీ వచ్చే నెల 14న టెట్ ఫలితాలు వెలువడిన మరుసటి రోజు అంటే 15వ తేదీ నుంచి డీఎస్సీ రాత పరీ క్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 27వ తేదీ టెట్, వచ్చే నెల 15 నుంచి డీఎస్సీ నిర్వహించబోతున్నారు. ఇంత తక్కువ వ్యవధిలో రెండు పరీక్షలకు ఎలా సిద్ధం కాగలమని నిరుద్యోగులు ప్రశ్నిస్తు న్నారు. రెండు పరీక్షల మధ్య తగినంత సమయం ఉండేలా ప్రభుత్వం షెడ్యూల్‌లో మార్పులు చేయాలని సర్వత్రా కోరుతున్నారు.







● నామమాత్రంగా భర్తీ

తాజాగా ఎన్నికల ముందు మెగా డీఎస్సీ పేరుతో దగా డీఎస్సీని ప్రకటించి ప్రభుత్వం నామమాత్రంగా పోస్టులను భర్తీ చేస్తున్నట్లు ప్రకటించింది. రూ.లక్షలు వెచ్చించి డీఎడ్, బీఈడీ కోర్సులు పూర్తి చేసిన యువత తమ భవిష్యత్ ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పరీక్షలకు వ్యవధి లేకపోవడంపై కొంతమంది అభ్యర్థులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నట్లు తెలిసింది. మరికొంతమంది డీఎస్సీలో పోస్టుల సంఖ్యను కూడా పెంచాలని కోరుతూ న్యాయస్థానానికి వెళ్లాలన్న యోచనలో ఉన్నట్లు సమాచారం.

● పోస్టులు తక్కువ.. పోటీ ఎక్కువ

రాష్ట్ర వ్యాప్తంగా 6100 పోస్టులకుగాను జిల్లాలో 346 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇందులో సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ)లు 104, స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఏ)లు 140, టీజీటీలు 102 పోస్టులు ఉన్నాయి. వేలాదిమంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఐదేళ్ల నుంచి ఎదురుచూస్తున్నారు.

● నిరుద్యోగుల నిరాశ

గత ఐదేళ్లలో డీఎడ్ పూర్తి చేసిన వారు 10వేల మంది, బీఈడీ పూర్తి చేసిన మరో 10వేల మంది కలిపి 20వేల మంది వరకు నిరుద్యోగులు జిల్లాలో డీఎస్సీ కోసం ఎదురుచూ స్తున్నారు. వీరిలో అత్యధికశాతం గ్రామీణ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన యువతే ఉపాధ్యాయులుగా స్థిరపడాలన్న ఆలోచనలతో రూ.లక్షలు వెచ్చించి కోర్సులు పూర్తి చేశారు. తాజాగా ప్రభుత్వం నామమాత్రంగా డీఎస్సీ ప్రకటన చేయడంతో వారు నిరాశ పడ్డారు.

● నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి ఈనెల 12 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. 12 నుంచి 21వతేదీ వరకు ఫీజు చెల్లించి సీఎస్ఈ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 22లోగా దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అనంతరం 24న ఆన్‌లైన్ మాక్ టెస్ట్ నిర్వహించి, మార్చి 5 నుంచి హాల్‌టికెట్‌లను పంపిణీ చేస్తామని వివరించారు. అలాగే ఫిబ్రవరి 8 నుంచి టెట్ నిర్వహణ చేపట్టి ఏప్రిల్ 7న ఫలితాలు వెల్లడిస్తామన్నారు. అలాగే టెట్‌కు ఫీజు చెల్లించేందుకు చివరితేదీ ఈనెల 17, దరఖాస్తుకు చివరితేదీ ఈనెల 18గా నిర్ణయించామన్నారు. ఫిబ్రవరి 23 నుంచి హాల్‌టికెట్‌లను అందచేస్తామన్నారు.

ఉపాధ్యాయ నియామకాలు మోసపూరితం : ఎస్టీయూ



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గంటా మోహన్

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 11 : జీవో 117 ద్వారా వేలాది టీచరు పోస్టులకు మంగళం పాడిన ప్రభుత్వం తాజాగా అప్రెంటీస్ విధానంలో టీచర్ల నియామకం చేపట్టాలని ప్రయత్నించడం మోసపూరితమని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) నేతలు ధ్వజమెత్తారు. నెల్లూరులోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ మాట్లాడుతూ వారంలో రద్దు చేస్తామన్న సీపీఎస్ రద్దు చేయకపోగా, జీపీఎస్ భూతాన్ని ప్రవేశపెట్టడం దారుణమన్నారు. డీఎస్సీ పోస్టులను సైతం నామమాత్రంగా విడుదల చేయడం దారుణమన్నారు. రాష్ట్ర కార్యదర్శి అశోక్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగుల జీతాల నుంచి పొదుపు చేసుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ మొత్తాలకు కూడా భద్రత లేదన్నారు. అనంతరం ఎస్టీయూ జిల్లా కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా వై.అశోక్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా జీ.రాజమనోహర్, ఆర్థిక కార్యదర్శిగా కే నరసింహం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఏ. ఏడుకొండలు, పీ కృష్ణయ్య, కే.కృష్ణ, డీ మహేష్‌లతోపాటు కార్యవర్గ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ప్రయోగ పరీక్షల ప్రారంభానికి ముందు నెల్లూరులోని ఓ ప్రైవేటు కళాశాల ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఆర్ఐవో శ్రీనివాసులు

ఇంటర్ ప్రయోగ పరీక్షల ప్రారంభం

- తొలిరోజు 7,032 మంది హాజరు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 11 : జిల్లావ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్) ఆదివారం నాన్‌జంబ్లింగ్ విధానంలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు 107 కేంద్రాల్లో జరిగిన ప్రాక్టికల్స్‌కు జనరల్ విద్యార్థులు 7,032 మంది హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు 3,041 మంది హాజరు కావాల్సి ఉండగా, 2,958 మంది హాజరయ్యారు. 83 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్స్‌కు 4,203 మంది హాజరు కావాల్సి ఉండగా, 4,074 మంది హాజరయ్యారు. 129 మంది గైర్హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం కలిపి మొత్తం 7,244 మంది హాజరు కావాల్సి ఉండగా, 7,032 మంది హాజరయ్యారు. 212 మంది గైర్హాజరయ్యారు. ప్రాక్టికల్స్ జరుగుతున్న పలు పరీక్ష కేంద్రాలను పరీక్షల నిర్వహణ కన్వీనర్, ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు, డీఈసీ సభ్యులు, తదితరులు పరిశీలించారు. విద్యార్థుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, వారి సమస్యలను 0861-2320312 నెంబరుకు తెలియచేయాలని ఆర్ఐవో తెలిపారు.



విద్యుత్ శాఖలోనూ

వేతనాల వెతలు

- పదిరోజులు గడిచినా అందని జీతాలు
- తీవ్ర ఆవేదనలో ఉద్యోగులు, సిబ్బంది

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 11: గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యుత్ శాఖలోనూ జీతాల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. కొంతకాలంగా ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర అవేదన చెందుతున్నారు. సహజంగా కాంట్రాక్టర్లకు బిల్లులు ఆగడం జరుగుతూ ఉంటుంది. విద్యుత్‌శాఖ చరిత్రలో ఎప్పుడూ కూడా ఉద్యోగులు జీతాలకు ఇబ్బంది పడిన దాఖలు లేవు. అయితే గత ఏడాది కాలంగా విద్యుత్‌శాఖలోనూ పేదరికం పెరిగినట్లుంది. ఒకటో తేదీన ఇవ్వాల్సిన జీతాలు పది, పన్నెండు తేదీల వరకు కూడా ఇవ్వడం లేదు. జిల్లాలో జూనియర్ లైన్‌మెన్ల నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు రెండువేలకుపైగా ఉన్నారు. వీరందరికి ప్రతి నెలా రూ.20 కోట్లకుపైగా జీతాలను ఏపీఎస్పీడీసీఎల్ సంస్థ అందస్తున్నది. అయితే గత ఏడాది కాలంగా జీతాలను ఒకటవ తేదీకి ఇవ్వకపోతుండటంతో బ్యాంకు రుణాలతోపాటు ఇంటి అద్దెలు, ఖర్చులకు ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. బ్యాంక్‌ల్లో చెక్కులు బౌన్స్ అవుతుండటతో జరిమానాలు పడుతున్నాయని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ బిల్లులకు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాల కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇస్తూ, వేతనాలను సకాలంలో చెల్లించకుండా తమని ఇబ్బంది పెడుతున్నారని ఉద్యోగులు, సిబ్బంది వాపోతున్నారు.

నేటి నుంచి స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సేవలు

నెల్లూరు(హరనాథపురం): నెల్లూరు నగరంలోని చిల్డ్రన్స్ పార్కు వద్ద ఒక ప్రైవేటు భవంతిలో ఉన్న స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం చిరునామా మారింది. రేబాలవారి వీధిలోని పూర్వపు ప్రభుత్వ చిన్నపిల్లల వైద్యశాల పక్కనున్న ప్రభుత్వ భవంతిలోకి దానిని మార్చామని జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యాలయం సేవలు సోమవారం నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

జీజీహెచ్‌కి వైద్యనిపుణులు

- నలుగురు స్పెషలిస్టు డాక్టర్ల రాక
- న్యూరో ఫిజిషియన్లు, న్యూరో సర్జన్లు ఇద్దరు చొప్పున నియామకం
- త్వరలో గుండె వైద్యనిపుణుడు కూడా...
- మరింత విస్తృతంగా వైద్యసేవలు

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 11: నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)కి త్వరలో వైద్య నిపుణులు రానున్నారు. న్యూరో ఫిజీషియన్, న్యూరో సర్జరీ విభాగాలకు చెందిన స్పెషలిస్ట్ వైద్యులు ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం యూరాలజీ విభాగంలో డాక్టర్ జయరాజ్ అందుబాటులో ఉన్నారు. కాగా న్యూరాలజీ ఫిజీషియన్‌లుగా ఇద్దరు వైద్య నిపుణులు, న్యూరో సర్జన్లుగా మరో ఇద్దరు వైద్య నిపుణులు రానున్నారు. జీజీహెచ్‌లో వీరి అవసరం ఎంతో ఉంది. త్వరలో గుండె వైద్యనిపుణులు కూడా రానున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. కాగా నెల్లూరు జిల్లాలో జాతీయ రహదారి విస్తరించి ఉండటం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతిరోజూ నెల్లూరుతో పాటు జిల్లాలోనూ సరాసరి 10 వరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. జీజీహెచ్‌కి ప్రతిరోజు 1,200 నుంచి 1,500 మంది వరకు రోగులు వస్తుంటారు. ఇన్‌పేషెంట్లుగా 500 మందికిపైగా రోగులు చికిత్స పొందుతుంటారు.



నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

ప్రస్తుతం జీజీహెచ్‌లో 235 మంది వైద్యులు వరకు పనిచేస్తున్నారు. రోడ్డు ప్రమాద బాధితులు ముందుగా జీజీహెచ్‌కే వస్తుంటారు. ఈ పరిస్థితిలో న్యూరాలజీ, న్యూరోసర్జన్‌ల అవసరం ఎక్కువగా ఉంది. తాజాగా న్యూరోసర్జన్లుగా డాక్టర్ ధీరజ్, డాక్టర్ దినేష్‌లు, న్యూరో ఫిజీషియన్లుగా డాక్టర్ ఫణికుమార్, డాక్టర్ లావణ్యలు వస్తున్నారు. కాగా స్పెషలిస్ట్ వైద్యుల నియామకంపై ఉన్నతాధికారులు డీఎంఈకి పలుమార్లు రాతపూర్వకంగా తెలియచేశారు. ఎట్టకేలకు డీఎంఈ అంగీకరించి అవసరమైన వైద్య నిపుణులను నియమించారు.

వైద్య నిపుణులు వస్తున్నారు...



జీజీహెచ్‌కి వైద్య నిపుణులు వస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు డీఎంఈకి రాతపూర్వకంగా తెలియచేశాం. ప్రస్తుతానికి ఐదుగురు నిపుణులు వస్తున్నారు. గుండె వైద్య నిపుణులు కూడా త్వరలో వస్తారు. వీరంతా వస్తే వైద్యసేవలను మరింతగా విస్తరించవచ్చు.

- డాక్టర్ సిద్ధా నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

రక్తమోడుతున్న రహదారులు

- జిల్లాలో వరుస రోడ్డు ప్రమాదాలు
- ప్రయాణమంటేనే వణుకుతున్న ప్రజలు
- మితిమీరిన వేగం, నిద్రమత్తులోనే ఘటనలు



కావలి ముసునూరు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న జిల్లా పోలీసు అధికారులు (ఫైల్)

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) ఫిబ్రవరి 11: జిల్లాలోని రోడ్లు రక్తమోడుతున్నాయి. వరుస రోడ్డు ప్రమాదాలతో ప్రజలు ప్రయాణం చేయాలంటేనే వణుకుతున్నారు. జిల్లాలోని జాతీయ రహదారులు రక్తం రుచి మరగడంతో ఎంతో మంది మృత్యుఒడికి చేరుతున్నారు. మితిమీరిన వేగం, రాత్రి పూట నిద్రమత్తులో వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలకు ఎక్కువగా జరుగుతున్నాయని అధికారులు భావిస్తున్నారు. తాజాగా జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. పోలీసు శాఖ, ఆర్టీసీతో పాటు పలు శాఖల అధికారులు ప్రమాదాల నివారణపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు.ఈ క్రమంలో కావలి ముసునూరు వద్ద శనివారం జరిగిన ఘోర దుర్ఘటన అధికారులను కలవరపెడుతున్నది.

● నిద్రమత్తులోకి జారుకుంటూ...

లోడ్‌తో వెళ్లే లారీడ్రైవర్లు ప్రయాణం కలిసి వస్తుందన్న భావనతో రాత్రిళ్లు ఎక్కువసేపు వాహనాలను నడుపుతుంటారు. ఈ క్రమంలో రాత్రి 12 నుంచి ఉదయం 4 గంటలలోపు అధికంగా ప్రమాదాలు జరుగుతుంటాయి. జిల్లాలో అధిక రోడ్డు ప్రమాదాలుఈ సమయంలోనే జరిగినవే. అందులోనూ జిల్లాను మంచుదుప్పటి కప్పేయడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. అంతేకాక జాతీయరహదారిపై వాహనాలను నిలుపుకుని విశ్రాంతి తీసుకునేలా రెస్ట్‌రూమ్‌లను ఏర్పాటు చేశారు.

ప్రాణం కంటే మించింది లేదు

రాత్రిళ్లు విశ్రాంతి లేకుండా వాహనం నడపడం ద్వారా డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకునే అవకాశాలు ఉన్నాయి. నిద్ర వస్తుందని భావిస్తే వాహనాలను పార్కింగ్ ప్రాంతాల్లో నిలిపి విశ్రాంతి తీసుకోవాలి. ప్రాణం కంటే మించింది లేనేలేదు.

- జీ చందర్, డీటీసీ

జిల్లాలో కావలి వద్ద గౌరవరం, వెంకటాచలం దాటిన తర్వాత కృష్ణాపట్నంకు వెళ్లే మార్గం వద్ద రెస్ట్‌రూములు ఉన్నాయి. అయితే భారీ వాహనాల డ్రైవర్లు డాబాలు, దుకాణాలు వద్ద, రోడ్డుకు పక్కగా వాహనాలు నిలిపి విశ్రాంతి తీసుకోవడం, బహిర్భూమికి వెళ్లడం ద్వారా మంచులో వాహనాలు కనిపించక వెనుక వస్తున్న వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి.

● ఫొటోలకే పరిమితం

ప్రమాదాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నా అవి ఆచరణలోకి అమలు కావడంలేదు. ప్రతినెలా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం జరుగుతున్నా, అక్కడ చేసిన తీర్మానాలు అమలు కావడం లేదు. ఇక వాహనాలను రాత్రిళ్లు నిలిపి ఫేస్‌వాష్ కార్యక్రమం ఫొటోలకే పరిమితం అవుతుందని ఆరోపణలు ఉన్నాయి. అధికారుల మెప్పుకోసం, పని చేశాం... అని నిరూపించుకునేందుకు ఫొటోల కోసం పలు శాఖల అధికారులు, సిబ్బంది పోటీ పడుతున్నారు.

వైభవంగా సత్తెమ్మకు పాల పొంగళ్లు

కలువాయి, ఫిబ్రవరి 11: మండలంలోని తోపుగుంట గ్రామదేవత సత్తెమ్మకు ఆదివారం పాల పొంగళ్లు వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు భక్తిశ్రద్ధలతో పూజా సామాగ్రి తీసుకుని మేళతాళాలతో సత్తెమ్మ ఆలయానికి చేరుకుని అక్కడే పాల పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అమ్మవారి ప్రతిమను పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మండలంలోని పలు గ్రామాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా వివిధ ప్రదేశాలలో స్థిరపడిన వారందరూ గ్రామానికి చేరుకుని అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



పూలతో ప్రత్యేకంగా తయారు చేసిన అమ్మవారి ప్రతిమ

ఆరోగ్యశ్రీ డబ్బుపై కన్నేసిన ఆపరేటర్

- ఉన్నతాధికారుల హెచ్చరికలతో విచారణ
- వాస్తవమని తేల్చిన జీజీహెచ్ అధికారులు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 11 : ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స చేయించుకునే రోగులకు ఇచ్చే నగదుపై నెల్లూరులోని జీజీహెచ్‌లో పనిచేసే ఓ కంప్యూటర్ ఆపరేటర్ కన్నేసింది. అయితే విజయవాడలోని ఆరోగ్య శ్రీ ట్రస్ట్ అధికారులకు అనుమానం రావటంతో దీనిపై జిల్లా అధికారులను హెచ్చరించారు. విచారణ జరపగా ఇది వాస్తవమని తెలియటంతో ఆ ఆపరేటర్‌పై చర్యలకు కమిటీ వేయటం జరిగింది. వివరాలిలా ఉన్నాయి... పెరాలసిస్, గుండె వ్యాధిగ్రస్తులు ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయించుకున్న తర్వాత వారు ఇంటిలోనే కొన్ని నెలల పాటు బెడ్‌రెస్ట్‌లో ఉంటారు. రోగులకు రోజు వారీ ఖర్చు కింద దాదాపు రూ.30 వేలు ఇస్తారు. ఆసరా పేరుతో ఇచ్చే ఆ నిధులు ఎలాగైనా అక్రమ మార్గంలో కాజేసేందుకు కంప్యూటర్ ఆపరేటర్ సీహెచ్ రేణుక ప్రయత్నం చేసింది. ఇందుకు సంబంధించి పత్రాలు సిద్ధం చేసింది. ఆరోగ్యశ్రీ రాష్ట్ర అధికారుల హెచ్చరికలతో జిల్లా అధికారులు విచారణ జరిపి ఆపరేటర్ అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారించారు. విషయాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకువెళ్లటంతో ఆయన ప్రత్యేక కమిటీ వేసి విచారణ జరుపుతున్నారు. నాలుగు నెలల నుంచి ఆసరా కింద 12 మంది రోగులను ఇన్‌పేషెంట్లుగా చూపినట్లు తెలిసింది. అయితే ప్రభుత్వం నుంచి వారికి ఆసరా కింద డబ్బులు చెల్లించారా లేదా అన్నది తెలియాల్సి ఉంది. పూర్తిస్థాయి విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

ప్రమాదానికి గురైన వాహనాల తొలగింపు

కావలి, ఫిబ్రవరి 11: ముసునూరు టోల్‌ప్లాజా సమీపంలో జాతీయ రహదారిపై శనివారం తెల్ల వారుజామున ప్రమాదానికి గురైన వాహనాలను ఆదివారం పోలీసులు, టోల్‌గేట్, హైవే అధికారులు తొలగించారు. ఐరన్‌లోడ్ లారీ, గోవుల లోడ్ లారీని, ప్రైవేట్ ట్రావెల్ బస్సును ఢీకొనడంతో ఏడుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే శనివారం ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఆ వాహనాలను రహదారి పక్కకు జరిపి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రహదారి పక్కన ఉన్న ఆ వాహనాల వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాటిని పూర్తిగా రహదారిపై లేకుండా ఒక దాబా వద్ద ఖాళీగా ఉన్న ప్రదేశానికి క్రేన్‌లతో తీసుకెళ్లి అక్కడ పెట్టారు. ఈ కార్యక్రమంలో కావలి రూరల్ సీఐ శ్రీనివాసరావుగౌడ్, టోల్‌ప్లాజా మేనేజరు గణేష్, పీఆర్వో నరసింహారావు, సేఫ్టీ మేనేజరు చక్రవర్తి, ప్రాజెక్ట్ హెడ్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదానికి గురైన బస్సును తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ముగ్గురు నిందితుల అరెస్ట్

- బంగారం, నగదు, బైకు స్వాధీనం

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 11 : వివిధ పోలీసు స్టేషన్లలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్న ముగ్గురు వ్యక్తులను నెల్లూరు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ వివరాలను రూరల్ డీఎస్పీ వీరాం జనేయరెడ్డి ఆదివారం మీడియాకు వివరించారు. నెల్లూరు రూరల్, వేదాయపాళెం, కొడవలూరు, యలమంచిలి, కనిగిరి పోలీసు స్టేషన్లలో దొంగతనాల కేసుల్లో కీలకంగా వ్యవహరించిన ముత్తుకూరు మండలం బ్రహ్మదేవికి చెందిన షేక్ గౌస్‌బాషా, నెల్లూరు రూరల్ మండలం నారాయణరెడ్డిపేటకు చెందిన లింగుబేరి రాంబాబు, కావలిలోని కలుగోళమ్మ పేటకు చెందిన నడింపల్లి గోపిని అదుపులోకి తీసుకుని విచారించగా 7 కేసుల్లో నిందితులుగా తేలిందన్నారు. వారి నుంచి 25 సవర్ల బంగారం, రూ.10 వేలు నగదు, బైకును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులపై రౌడీషీట్, సస్పెక్టు షీట్ కూడా ఉన్నాయని తెలిపారు. విలాసవంతమైన జీవితం కోసం నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్ర మంలో సీఐ వీ సుబ్బారావు, ఎస్‌ఐ వీ సుబ్బారావు పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వీరాంజనేయ రెడ్డి

రూ. 9 కోట్ల భూమి ఆక్రమణకు యత్నం

- డీకేటీ పట్టాలున్నాయంటూ రంగంలోకి స్థానికులు
- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు
- తెరవెనుక వైసీపీ నాయకులు...?

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 11 : నెల్లూరు నగర శివారు ప్రాంతం కల్లూరుపల్లి వద్ద భారీ భూ ఆక్రమణకు స్థానికులు తెరలేపారు. ఆదివారం ఎక్స్‌కవేటర్లతో ఆ భూమిని చదును చేయసాగారు. వివరాలు ఇలా ఉన్నాయి... జాతీయ రహదారిపై కనుపర్తిపాడు క్రాసు రోడ్డు నుంచి గొలగమూడికి వెళ్లే మార్గంలో సర్వేపల్లి కాలువ వంతెన నుంచి కరకట్టపైన 2 కి.మీ దూరాన ఓ చెరువు కట్ట వద్ద సుమారు నాలుగున్నర ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇది తుమ్మచెట్లతో నిండిన బీడు భూమి. దానిపై కన్నేసిన కొందరు వ్యక్తులు స్థానికులను ఉసిగొలిపి ఆక్రమణకు యత్నించారు. భూమి లేని వారికి పట్టాలిప్పిస్తామంటూ కొందరు వైసీపీ నాయకులు అమాయకులైన స్థానికులను రంగంలోకి దింపారు. ఆ భూమిలో తమ పూర్వికులకు డీకేటీ పట్టాలిచ్చారని, వాటిని తిరిగి పట్టాలుగా మార్చి ఇప్పు డున్న ప్రభుత్వంలో మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. దీంతో ఆశావహులు భూమిని చదును చేసే పనిలోపడ్డారు. బయట మార్కెట్లో రూ.9 కోట్ల విలువ చేసే ఆ భూమి అన్యాక్రాంతమవుతోందని రూరల్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో అధికారులు అక్కడికి చేరుకుని ఎక్స్‌కవేటర్లను అడ్డుకున్నారు. గత పట్టాలేమైనా ఉంటే ఉన్నతాధికారులతో మాట్లాడుకోవాలంటూ స్థానిక వీఆర్వో హెచ్చరించారు. ఈ కబ్జా యత్నం విషయం మీడియాకు తెలి యడంతో ఇటు ఆక్రమణదారులు, అటు సూత్రధారులు ఉలిక్కిపడ్డారు. కాగా, ఈ విషయమై స్థానిక వీఆర్వో మెర్సీని వివరణ కోరగా ఆ భూమి ప్రభుత్వానికి చెందినదని, అనుమతి లేకుండా ఎవరూ ప్రవేశించేందుకు వీలు లేదని చెప్పారు. ఏదైనా ఉంటే ఉన్నతాధికారులతో మాట్లాడుకోవాలని సూచించామని తెలిపారు.



భూమి చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	143
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	252
స్కిన్‌లెస్	280
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5952
వెండి కిలో ధర	రూ. 72,600
వెండి ఒక గ్రాము	రూ. 74.60

వైద్య రంగంలో మార్పు ఇదేనా ?

- ఆసుపత్రుల నిర్వహణకూ కష్టాలు
- సీహెచ్‌సీల్లో వసతుల్లేక రోగుల అవస్థలు
- టెండర్లు పిలిచినా ముందుకు రాని కాంట్రాక్టర్లు
- కేంద్ర నిధులూ వినియోగించలేని దుస్థితి
- పీహెచ్‌సీలో ఆరు పడకల నిర్మాణానికి బ్రేక్

నెల్లూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునాతనంగా మార్చాం.. రోగులకు ఇబ్బందుల్లేకుండా 24 గంటలూ సేవలందిస్తున్నాం.. గ్రామీణ వైద్యంలో మార్పులు తీసుకొచ్చాం'.. అని ప్రభుత్వం పదే పదే గొప్పలు చెప్పుకుంటోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులను గమనిస్తే వైద్య రంగం పరిస్థితి ఎలా ఉందో తేటతెల్లమవుతుంది. దారుణంగా తయారైన ఆసుపత్రుల భవనాలు, రోగులు కూర్చునేందుకు కుర్చీలు లేక అవస్థలు, రాత్రిళ్లు అందుబాటులో ఉండని వైద్యులు.. ఇలా అనేక ఇబ్బందులు కనిపిస్తున్నాయి. మరోవైపు ఏళ్లు గడుస్తున్నా ఆసుపత్రుల భవనాలను కూడా పూర్తి చేయలేని దుస్థితి నెలకొంది. ఇవన్నీ ఒక ఎత్తయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల్లో అదనంగా ఆరు పడకల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే ఆ నిధులను కూడా సద్వినియోగం చేసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఏడాది నుంచి టెండర్లు పిలుస్తున్నా ఈ భవనాల నిర్మాణాలకు ఒక్క కాంట్రాక్టర్ కూడా ముందుకు రావడం లేదు. ఇదీ ప్రభుత్వంపై కాంట్రాక్టర్లకు ఉన్న నమ్మకం. ఈ ప్రభావం అంతిమంగా ప్రజలపై తీవ్రంగా పడుతోంది.

భవనాలకు మరమ్మలేవి ?

జిల్లాలోని సామాజిక ఆరోగ్య కేంద్రా(సీహెచ్‌సీ)ల్లో గత కొన్నేళ్లుగా నిర్వహణ లేకపోవడంతో ఆ భవనాలు మరమ్మతులకు గురయ్యాయి. అక్కడి సామగ్రికి కూడా నిర్వహణ చేయాల్సి ఉంది. ఈ క్రమంలో సీహెచ్‌సీల్లో మరమ్మతులు, నిర్వహణకు కొంతకాలంగా టెండర్లు పిలుస్తున్నారు. పదే పదే టెండర్లు ఆహ్వానించినా కాంట్రాక్టర్ల నుంచి స్పందనలేదు. ప్రస్తుతం ఉదయగిరి సీహెచ్‌సీ నిర్వహణకు రూ.12.33 లక్షలు, వింజమూరు సీహెచ్‌సీ నిర్వహణకు రూ.11.69 లక్షలతో ఐదోసారి టెం డర్ పిలిచారు. మిగిలిన సీహెచ్‌సీలది కూడా ఇదే పరిస్థితి. అదే విధంగా దేశంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పీహెచ్‌సీల్లో అదనంగా పడకలు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకుగానూ రాష్ట్రానికి కూడా నిధులు మంజూరు చేయగా, ఈ పథకం కింద జిల్లాలో పదమూడు పీహెచ్‌సీలను ఎంపిక చేశారు. సైదాపురం, నెల్లూరు రూరల్ మండలం అల్లీపురం, అనంతసాగరం మండలం మహిమలూరు, చేజర్ల మండలం చిత్తలూరు, తోటపల్లి గూడూరు మండలం వరిగొండ, కులువాయిలోని పీహెచ్‌సీలతోపాటు మరో ఏడు పీహెచ్‌సీలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ప్రస్తుతమున్న పీహెచ్‌సీ భవనంపైన ఈ ఆరు పడకల గదిని నిర్మించాల్సి ఉంది. ఒక్కో నిర్మాణాన్ని రూ.9 లక్షల అంచనాతో ఇప్పటికి ఐదు సార్లు టెండర్లు పిలిచినా ఒక్క టెండర్ కూడా దాఖలు కాలేదు. గతేడాదంతా టెండర్లు పిలిచిన ఆర్‌అండ్‌బీ అధికారులు ఇక చేసేది లేక ఆగిపోయారు. అంటే రూ.9 లక్షల పర్కును చేసేందుకు కూడా ప్రభుత్వాన్ని నమ్మి ఎవరూ ముందుకు రావడం లేదు. ఇక గ్రామీణ ఆరోగ్య కేంద్రాలంటూ హడావిడి చేసిన ప్రభుత్వం నాలుగేళ్ల గడిచినా శాశ్వత భవనాలు నిర్మించలేక పోయింది. జిల్లాలో రూ.94.64 కోట్లతో 455 గ్రామ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం చేపట్టగా ఇప్పటికి 153 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. ఈ పనులు చేసిన వారికి కూడా బిల్లులు ఇవ్వకపోవడంతో మిగిలిన భవనాలు ముందుకు కదలడం లేదు. ఈ పరిస్థితుల్లో గ్రామ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం చేయడం, పీహెచ్‌సీ ల్లో అదనపు గదుల ఏర్పాటు, సీహెచ్ సీల నిర్వహణ పనులు జరగడం కష్టమేనని నిపుణులు అభిప్రాయపడుతు న్నారు. క్షేత్రస్థాయిలో ఇన్ని లోటు పాట్లను పెట్టుకొని ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకు దిగడంపై ప్రజల నుంచి అసహనం వ్యక్తమవుతోంది.



ఆరు అదనపు పడకల నిర్మాణానికి ఎంపికైన సైదాపురం పీహెచ్‌సీ

జిల్లా బాడీ బిల్డర్స్ ఎంపిక



ఎంపికైన బాడీ బిల్డర్స్‌తో అసోసియేషన్ బాధ్యులు

కావలిటౌన్, ఫిబ్రవరి 11: బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ నెల్లూరు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా జనరల్ సెక్రటరీ అల్షద్ పర్యవేక్షణలో స్థానిక జీడీడీ కాంప్లెక్స్‌లోని అల్షద్ గోల్డ్ జిమ్‌లో జిల్లా బాడీ బిల్డర్స్ ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికల్లో జిల్లా నలుమూలల నుంచి బాడీ బిల్డర్స్ పాల్గొని తమ శరీర సౌష్టవాన్ని ప్రదర్శించారు. సెలక్టర్లుగా రాష్ట్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలు సీమ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీను, జడ్జెస్ జ్యూరీ మెంబర్స్ గౌస్, మహఫూజ్ ఆలీ, హరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీమ, శ్రీనులు మాట్లాడుతూ జిల్లాకు ఎంపికైన బాడీ బిల్డర్స్ ఈనెల 24, 25 తేదీల్లో జరగబోయే మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. బాడీ బిల్డింగ్, ఫిట్‌నెస్ పట్ల యువతలోనే కాక అందరిలో ఆసక్తి, ఆదరణ పెరుగుతుందని, భవిష్యత్‌లో బాడీ బిల్డింగ్ పట్ల మరింత ఆదరణ పెరగనుందన్నారు.

ఏటా జాబ్ కేలండర్ ఏమైంది జగన్ ?

- తెలుగు యువత నేత తిరుమల నాయుడు



మాట్లాడుతున్న తిరుమల నాయుడు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 11 : ప్రతి ఏటా జాబ్ కేలండర్ ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటనలు ఏమయ్యాయని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు తిరుమల నాయుడు ప్రశ్నించారు. ఆదివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో యువత, విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు. అదిగో .. ఇదిగో అంటూ నాలుగేళ్ల ఊరించి కేవలం 6100 పోస్టులతో దగా డీఎస్సీని ప్రభుత్వం విడుదల చేసిందని విమర్శించారు. లులూ, ఆదాని డేటా సెంటర్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, అమర్‌రాజా వంటి ఎన్నో పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపో యాయన్నారు. టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు అమ్ముల్లా మాట్లాడుతూ నాలుగేళ్లలో 4,709 ప్రభుత్వ పాఠశాలలు రద్దు చేసి 50 వేల ఉపాధ్యాయ పోస్టులు గాలికి వదిలేశార న్నారు. టీడీపీ హయాంలో పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయగా వైసీపీ ప్రభు త్వం దాన్ని రద్దు చేసిందని ఆరోపించారు. వలంటీర్ ఉద్యోగాలు, ఫిష్, మటన్ మార్కెట్‌లో ఉద్యోగాలు, మరుగుదొడ్ల వద్ద టోకన్ బాయ్ ఉద్యోగాలు మాత్రమే వైసీపీ ప్రభుత్వం ఇచ్చిం దని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ కార్యదర్శులు కొమరి విజయమ్మ, కప్పిర రేవతి, తెలుగు యువత నేత వడ్డిమూడి రమేష్, ప్రవీణ్, సాయికిరణ్, వేణు, కమ్మ ప్రభాకర్, శ్రీదేవి, వసీం తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సమావేశం రసాభాస

కావలి, ఫిబ్రవరి 11: కావలి ట్రంకురోడ్డు పక్కన ఉన్న పొట్టిశ్రీరాములు, గాంధీ విగ్రహాలు ట్రంకురోడ్డు విస్తరణకు ఇబ్బందికరంగా ఉన్నందున వాటిని ట్రంకురోడ్డు డివైడర్ల మీదకు తీసుకురావాలన్న ప్రతిపాదనలపై కావలి ఆర్యవైశ్యులు నిర్వహించిన సమావేశం రసాభాసగా సాగింది. ఆదివారం సాయంత్రం స్థానిక కోర్టు వీధిలోని కల్యాణ మండపంలో ఆర్యవైశ్యులు సమావేశం నిర్వహించారు. అయితే ట్రంకురోడ్డు విస్తరణ పనులు జరగకుండానే అత్యవసరంగా వాటిని తొలగించాలన్న ప్రతిపాదనల వెనుక ఆంతర్యమేమిటని పలువురు ఆర్యవైశ్యులు ప్రశ్నించారు. ఆర్యవైశ్య నేత గ్రంధి యానాదిశెట్టి విగ్రహం ఎక్కడ పెట్టాలో ముందు తేల్చాలని, ఆ తర్వాత వీటి సంగతి మట్లాడదామని కొందరు ప్రశ్నించారు. గ్రంధియానాదిశెట్టి విగ్రహం పెట్టాలనుకున్న చోటే దానిని అడ్డుకునేందుకు ఈ విగ్రహాల ప్రతిపాదనలను రాజకీయ దురుద్దేశంతో తీసుకువచ్చారని కొందరు అభ్యంతరం చెప్పారు. ఎవరెన్ని చెప్పినా ఆ రెండు విగ్రహాలు డివైడర్‌పై పెట్టి తీరుతామని అధికారపార్టీకి చెందిన కొందరు ఆర్యవైశ్య నేతలు చెప్పడంతో సమావేశం రసాభాసగా సాగి ఏకాభిప్రాయం లేకుండానే ముగిసింది. ఇప్పటి వరకు అధికారపార్టీకి చెందిన ఆర్యవైశ్యులు తాము చెప్పిందే వేదం అన్నట్లుగా తీసుకుంటున్న నిర్ణయాలకు ఆటంకాలు ప్రారంభమయ్యాయి.

టీడీపీ, వైసీపీలు బీసీలకు సీట్లివ్వాలి

- బీసీ వెల్ఫేర్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బొమ్మి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బొమ్మి నాగకిషోర్ తదితరులు

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 11 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీలు బీసీలకు పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని బీసీ వెల్ఫేర్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బొమ్మి నాగకిషోర్ డిమాండ్ చేశారు. నెల్లూరులోని ఓ హోటల్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా నుంచి 3 అసెంబ్లీ స్థానాలను గానీ, రెండు అసెంబ్లీ ఒక పార్లమెంటు స్థానాన్నిగానీ బీసీలకు కేటాయించాలన్నారు. లేకపోతే ప్రత్యామ్నాయ పార్టీల వైపు బీసీలు వెళ్లక తప్పదన్నారు. వెంకటగిరి, ఉదయగిరి, కావలి, కందుకూరు నియోజకవర్గాల్లో బీసీలు పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈనెల 13న ఎస్ఆర్ కల్యాణ మండపంలో అన్ని కులసంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. విలేకరుల సమావేశంలో వివిధ కుల సంఘాల నాయకులు బెల్లంకొండ చిన్నయ్య, భాస్కర్ గౌడ్, ఆరంబాకం చంద్రశేఖర్, తరుణ్ సింగ్, బుధవారపు బాలాజీ, చిలకపాటి మాల్యాద్రి, పీఎల్ రావు, గండవరం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అపోహలొద్దు.. ఉదయగిరి అభ్యర్థిని నేనే !

- మాజీ ఎమ్మెల్యే బొల్లినేని

కలిగిరి, ఫిబ్రవరి 11: ఉదయగిరి నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ తరుపున పోటీ చేసేది తానేనని, పత్రికల్లో, సోషల్ మీడియాలో వస్తున్న అపోహలను నమ్మవద్దని మాజీ ఎమ్మెల్యే, ఉదయగిరి టీడీపీ ఇన్‌చార్జి బొల్లినేని వెంకటరామారావు స్పష్టం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని 8 మండలాలకు చెందిన ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను పోటీ చేయకపోతేనే మరొకరు అభ్యర్థి అవుతారే తప్ప, చంద్రబాబుకు తాను పరిచయం చేసిన వాళ్లంతా టికెటు తమదే అనడాన్ని వాళ్ల విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో తనవద్ద డబ్బు లేదు, రానున్న ఎన్నికల్లో ఖర్చు పెట్టలేడు అంటూ అబద్ధపు ప్రచారాలతో తనపై వస్తున్న అసత్య ఆరోపణలకు మరో వారం రోజుల్లో స్పష్టత వస్తుందన్నారు. 2012లో జరిగిన బై ఎలక్షన్ నుంచి 2019 వరకు జరిగిన అన్ని ఎన్నికల్లో ఖర్చుకు ఏనాడు వెనకాడలేదని, ప్రస్తుతం నియోజకవర్గంలో సొంత ఖర్చుతో తాను సర్వే చేయించానని, రానున్న ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించడం ఖాయమన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొల్లినేని

వీళ్లేమైనా అంబానీలా....

ఉదయగిరి నియోజకవర్గంలో టీడీపీ టికెట్ కోసం మరొకరు ఇప్పటికే వందల కోట్లు పార్టీ ఆఫీసులో డిపాజిట్ చేశారన్న నాయకుల ప్రశ్నకు బొల్లినేని సమాధానం ఇస్తూ ఆడో వంద... ఈడో వంద అంటూ పార్టీ టికెట్ కోసం వందల కోట్లు డిపాజిట్ చేశామంటున్నారు.. వీళ్లేమైనా అంబానీలా అని ప్రశ్నించారు. దివంగత ఎన్టీఆర్ హయాం నుంచి నేటి వరకు తెలుగుదేశం పార్టీ ఏ నాయకుడి వద్ద టికెట్టు కోసం డబ్బు వసూలు చేయలేదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్టతతో పాటు గ్రామాల అభివృద్ధిలో పాలుపంచుకోవడం కోసం మాత్రమే తాను చంద్రబాబునాయుడుకి 10 మందికి పైగా వ్యక్తులకు పరిచయం చేశానని తెలిపారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో పార్టీ క్యాడర్‌పై తనకున్నంత పట్టు మరో నాయకుడికి ఉండే అవకాశమే లేదన్నారు.

కార్యకర్తలకే పెద్దపీట

నియోజకవర్గంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో అభివృద్ధిపైనే దృష్టి పెట్టడంతో కార్యకర్తలు అసంతృప్తిగా ఉన్న మాట నిజమేనని, ఇప్పటి నుంచి పార్టీలో కష్టించి పనిచేసే కార్యకర్తలకు పెద్దపీట వేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

తండ్రి ఇంట్లోకి రానివ్వడం లేదని కొడుకు ఆందోళన

మనుబోలు, ఫిబ్రవరి 11 : కన్న తండ్రే తనను ఇంట్లోకి రానివ్వడం లేదంటూ ఆదివారం సుమన్ అనే వ్యక్తి తన భార్యా బిడ్డలతో కలిసి స్థానిక బీసీ కాలనీలో ఉన్న తన ఇంటి ముందు ఆందోళన చేశాడు. ఈసందర్భంగా సుమన్ మాట్లాడుతూ తన తల్లి ఉమారాణి ఇదే ఇంట్లో ఉంటూ తనను తన ఇద్దరు చెల్లెలను పెంచి పోషించిందన్నారు. తన తల్లి చనిపోయే వరకు తండ్రి సురేష్ ఇంటికి రాకుండా దూరంగా ఉండేవాడన్నారు. కానీ తాను కష్టపడి ఇద్దరు చెల్లెలకు వివాహం చేశానని తెలిపాడు. కాగా తల్లి చనిపోతూ ఇంటిని తన పేరుతో రాసిచ్చిందని, అయితే తల్లి చనిపోయే సమయంలో ఇంటికి చేరుకున్న తండ్రి సురేష్ ఇంట్లో తిష్ట వేసి తనను ఇంట్లోకి రానివ్వకుండా తనకు హక్కు లేదంటూ ఇబ్బందులు పెడుతున్నాడన్నారు. ఇంటి పత్రాలు తన పేరుపై ఉన్నా ఎవరూ తనకు న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశాడు.



ఇంటి ముందు ఆందోళన చేస్తున్న సుమన్, కుటుంబ సభ్యులు

ఘనంగా గ్రీన్ హోమ్ వన్ వరల్డ్ ఫేస్-2 ప్రారంభం

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 11 : నెల్లూరు సిటీ హైవేకు అతి దగ్గరలో రెరా, నుడా అనుమతులతో గ్రీన్ హోమ్ వన్ వరల్డ్ గేటెడ్ కమ్యూనిటీ ఫేస్-2ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ఎండీ బొల్లినేని హజరత్ బాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు హైదరాబాద్, చెన్నై, బెంగళూరులో వేల ఎకరాల్లో లక్షల ఇళ్లు, ప్లాట్లు నిర్మించామన్నారు. ఇప్పుడు తన సొంత జిల్లా నెల్లూరులో గ్రీన్‌హోమ్ వన్ వరల్డ్ ప్రారం భించి అతి తక్కువ కాలంలో ఫేస్-2కు వెళ్లటం ఆనందంగా ఉందన్నారు. 50 ఎకరాల్లో అన్ని సదుపాయాలు ఏర్పరచి, వెంటనే ఇల్లు కట్టుకొనే విధంగా ఓపెన్ ప్లాట్లు, విల్లాలు ఏర్పాటు చేశామని చెప్పారు. విల్లాలను నాణ్యతలో రాజీ లేకుండా నిర్మించామన్నారు. వన్ వరల్డ్‌లో విల్లాలు, ఓపెన్‌ప్లాట్లు, అపార్టుమెంట్లు అందుబాటులో ఉంటాయని, బ్యాంకు లోన్ సౌకర్యం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రీన్‌హోమ్ డైరెక్టర్ బొల్లినేని హరిబాబు, బీవీ సాయిరాం, బొల్లినేని ఆనంద్, మార్కెటింగ్ డైరెక్టర్ బీవీ రామారావు, రాచాల రవికుమార్ యాదవ్, పుల్లయ్య, డానియల్ రాజు, రుషికేష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



వన్ వరల్డ్ ఫేస్-2 ప్రారంభోత్సవంలో హజరత్ నాయుడు, హరిబాబు తదితరులు

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 11 : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెల్లూరులోని వెంకటేశ్వర విద్యాలయంలో ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వై జనార్దన్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 35వేల టీచర్ పోస్టులకు డీఎస్సీ ప్రకటించాలని కోరారు. అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు మాట్లాడుతూ 117 జీవోను రద్దు చేయడంతోపాటు ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలన్నీ వెంటనే విడుదల చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణారెడ్డి, జుల్ఫికర్ అలీ, కౌన్సిలర్లు ఆరిఫ్ హుస్సేన్, హజరత్తయ్య, రాధాకృష్ణ, రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, రామసుబ్బారెడ్డి, కరీం మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో ఏఎస్ పేట

సరైన సౌకర్యాలు లేక భక్తుల అవస్థలు

ఏఎస్‌పేట, ఫిబ్రవరి 11: ప్రముఖ యాత్ర స్థలంగా పేరొందిన ఏఎస్ పేట అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. దర్గాకు విచ్చేసే భక్తులు సరైన సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. ఏఎస్ పేటలో హజరత్ సయ్యద్ ఖజారహమతుల్లా నయాబ్‌రసూల్ దర్గా ఉండడంతో దేశనలుమూలల నుండి ప్రతిరోజు వందల సంఖ్యలో, శుక్రవారం, సెలవు రోజులలో వేలాది మంది యాత్రి కులు విచ్చేస్తుంటారు. ప్రతిరోజు ఇక్కడి నుండి హైదారాబాదుకు ప్రత్యేక బస్సులు ఉన్నాయి. మన రాష్ట్రం నుంచేకాక తెలం గాణ, కర్ణాటక, చతీస్‌ఘడ్, ఉత్తరప్రదేశ్, తదితర రాష్ట్రాల నుండి యాత్రికులు విచ్చే స్తుంటారు. దీంతో దేశవ్యాప్తంగా ఏఎస్ పేట (రహమతాబాద్)గా గుర్తింపు పొందింది. కాగా, ఇటీవల దర్గా ప్రధాన వీధిలో డ్రైనేజీ నిర్మాణానికి గుంతలు తవ్వి వదిలేయడంతో దర్గాకు వెళ్ల డానికి ఇబ్బందులు పడుతు న్నారు. బస్టాండ్ సెంటర్‌లో బస్ షెల్టర్ కూలిపోయింది. అప్పటి నుండి షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దూరప్రాంతాల నుండి లగేజితో వచ్చిన వారు బస్సుల కోసం ఎండలోనే పడిగాపులు కాయవలసిన పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం, ప్రత్యేక సందర్భాలలో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు



డ్రైనేజీ నిర్మాణానికి తవ్విన గుంతలు



బస్సుల కోసం దుకాణాల ముందు వేచి ఉన్న యాత్రికులు

వస్తారు. వారంతా షెల్టర్ లేకపోవడవంతో నీడకోసం దుకాణల ముందు నిలబడుతుండడంతో తమ వ్యాపారానికి అడ్డం అని వ్యాపారులు వారిని పంపించి వేయడంతో ఎండలోనే వేచి ఉండాల్సి వస్తోందని మహిళలు, వృద్ధులు వాపోతున్నారు. బస్‌షెల్టర్ లేక ప్రయా ణికులు ఇబ్బందులు పడుతున్నా పట్టిం చుకునే నాథుడే లేకపోయాడని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. గ్రామంలో బస్టాండ్ నిర్మించాలని పలుమార్లు అధికారులకు, నాయకులకు తెలిపినా ఫలితం లేక పోయిందని వాపోతున్నారు.

మరుగుదొడ్లు లేక అవస్థలు

ప్రతిరోజు వందలమంది ప్రయాణికులు రాకపోకలు సాగించే యాత్ర స్థలంలో మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మహిళల పరిస్థితి మరీ దారుణంగా మారింది. వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. దేశవ్యాప్తంగా పేరుపొందిన గ్రామంలో కనీసం మరుగుదొడ్లు లేకపోవడం దారుణమని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి తగు సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు, గ్రామస్థులు, భక్తులు కోరుతున్నారు.

రామాలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ నిర్వహిస్తున్న నిర్వాహకులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 11: మండలంలోని గండిపాళెం ఎస్సీ కాలనీలో ఆదివారం రామాలయ నిర్మాణానికి కాలనీ వాసులు భూమి పూజా కార్యక్రమం నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాధాన, కలశపూజ, నవగ్రహ, వాస్తు హోమాలు, శంఖు ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జే కేశవలింగం, రాపల్లి తిరుపతి, రమణయ్య, శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రాపల్లి భారతీ, కిరణ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగారపమ్మకు పూజలు

సంగం, ఫిబ్రవరి 11: మండలంలోని కోలగట్లలో ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొంగళ్లు పొంగించి నైవేద్యంగా సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉత్సవాలకు ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 11: పట్టణంలోని సెయింట్ మేరీస్ పాఠశాల ఆవరణలో ఉన్న లూర్దుమాత చర్చి మహోత్సవాలకు మాజీ ఏఎంసీ చైర్మన్, మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి ఆదివారం తన ప్రతినిధులచే ఆర్థికసాయం అందజేశారు. ఉత్సవాల్లో అన్నదాన కార్యక్రమానికి ఆర్థికసాయం అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, గాజుల బాబు, అంకయ్య, సుకుమార్, అర్షద్, నౌషాద్, చర్చి ఫాదర్ సుదర్శన్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జైభారత్ పార్టీ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎస్‌డీ ఖాసింవలి

సీతారామపురం, ఫిబ్రవరి 11: జైభారత్ పార్టీ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎస్‌డి ఖాసింవలిని నియమించినట్లు ఉదయగిరి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ముప్పాళ్ళ శ్రీరామరాజు తెలిపారు. ఆదివారం సీతారామపురం పరిధిలోని నారాయణంపేట, పంద్రంగి గ్రామాలలో ఇంటింటికీ తిరిగి జై భారత్ పార్టీని బలపరచాలని కోరారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని ఎస్‌డి ఖాసింవలి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ళ రామరాజు, కొండమూరి శ్రీనివాస్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా హిందీ పరీక్ష



హిందీ ప్రాథమిక పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సంగం, ఫిబ్రవరి 11: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో విద్యార్థులకు హిందీ దివాస్ ప్రాథమిక స్థాయి పరీక్ష ఆదివారం జరిగింది. ఈ పరీక్షకు పాఠశాలకు చెందిన 42 మంది విద్యార్థులు హాజరయ్యారు. హిందీ ఉపాధ్యాయుడు పెంచలహరి ఇన్విజిలేటర్‌గా వ్యవహరించారు.

యునాని వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధుల దూరం



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, వైద్యసిబ్బంది

ఆత్మకూరు, ఫిబ్రవరి 11 : అతి ప్రాచీనమైన యునాని వైద్యంతో దీర్ఘకాలిక వ్యాదులు నయమవుతున్నాయని ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి పద్మావతి తెలిపారు. స్థానిక ప్రభుత్వ యునాని వైద్యశాలలో ఆదివారం జాతీయ యునాని డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ఇప్పటికే ఆత్మకూరు పట్టణంలోని యునాని వైద్య శాల ఎంతో మంది రోగులకు మెరుగైన సేవలు అందిస్తోందన్నారు. అన్ని వ్యాదులు నయమయ్యేందుకు అవసరమైన యునాని మందులు వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. యునాని వైద్యాన్ని ప్రతిఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు. ముందుగా వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వైద్యసిబ్బంది పట్టణంలో యునాని వైద్యంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ప్రభుత్వ యునాని వైద్యశాల వైద్యులు డాక్టర్ ఎండి అబ్దుల్ రజాక్, మహిమలూరు పీహెచ్‌సీ డాక్టర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'పల్లెకు పోదాం'

చేజర్ల, ఫిబ్రవరి 11 : మండలంలోని వావిలేరు, చేజర్ల, బోడిపాడు గ్రామాలలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు కుంకు బాలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల కిష్టయ్య, మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొని కేంద్రప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రచారం చేయడంతో పాటు, రామమందిరం ఏర్పాటు చేసినందుకు ధన్యవాద తీర్మానం మీద సంతకాలు సేకరించారు. అనంతరం ఆయా గ్రామాలలో బూత్ కమిటీలు ఏర్పాటుచేసి క్యాలెండర్‌లను పంపిణీ చేశారు.

దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 11: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని రైతుసంఘం నాయకులు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో రైత సంఘాల నాయకులు, కార్మికులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ రంగాలకు అప్పగించేందుకు తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దుచేస్తామన్న కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదన్నారు. కార్మిక, ఉద్యోగుల శ్రమను కారుచౌకగా అందించేందుకు కేంద్రం లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టడం దారుణమన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటుచేసి ఉచిత విద్యుత్‌కు మంగళం పాడేందుకు చర్యలు చేపడుతోందన్నారు. వీటిని వ్యతిరేకిస్తూ 16న చేపట్టే బంద్‌కు అందరూ కలిసివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు, సీపీఎం నాయకులు గుజ్జుల మల్లికార్జున, ఫరుద్దీన్‌బాషా, కోడె రమణయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మౌన ధ్యానం అలవర్చుకోవాలి

ఆత్మకూరు, ఫిబ్రవరి 11: ప్రతి ఒక్కరూ మౌన ధ్యానాన్ని అలవర్చుకోవడం ఎంతో శ్రేయస్కరమని ప్రముఖ మాస్టర్ పి తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక షిర్డీ సాయిరాం ధ్యాన మందిరంలో ధ్యానశిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తివంతులు తక్కువ మాట్లాడి అవతలి వారిని ఆకట్టుకుంటారని తెలిపారు. మౌనం అలవర్చుకోవడం, ఆచితూచి మాట్లాడం అన్నివిధాలా శ్రేయస్కరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్ డాక్టర్ చంద్రా సుబ్రహ్మణ్యంనాయుడు పట్టణంలోని పలువురు పిరమిడ్ మాస్టర్లు, ధ్యానసాధకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 11: జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 18వ తేదీ వరకు మత్తు పదార్థాల వ్యతిరేక ఉద్యమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జమాతే ఇస్లామీ హింద్ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ పేర్కొన్నారు. అందులో భాగంగా ఆదివారం పట్టణంలోని పలు వీధుల ప్రధాన కూడళ్లల్లో మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల మహమ్మారి నుంచి యువతను కాపాడి ఉత్తమ సమాజాన్ని నిర్మించడమే తమ సంస్థ ధ్యేయమన్నారు. దేశానికి యువత ఎంతో కీలకమని, వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నస్రుల్లా, మసూద్, సిద్ధిఖ్, మునాఫ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

పొంగూరులో ఉచిత వైద్యశిబిరం

మర్రిపాడు, ఫిబ్రవరి 11: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పొంగూరు గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆత్మకూరుకు చెందిన ప్రవేట్ వైద్యశాల వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం నల్లపోతుల రమేష్, గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేశారు.

ఘనంగా పోలేరమ్మకు పొంగళ్లు



కలశ స్థాపనకు జలాలు తెస్తున్న మహిళలు

సంగం, ఫిబ్రవరి 11: స్థానిక వెంకటేశ్వరపురంలో ఉన్న పోలేరమ్మకు ఆదివారం పొంగళ్లు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు మేళతాళాల నడుమ కనిగిరి ప్రధాన కాలువ నుంచి జలాలు తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకాలు, కలశ స్థాపన, ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామానికి చెందిన బాణా శ్రీనివాసులురెడ్డి, ప్రవీణ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు

బిట్రగుంట, ఫిబ్రవరి 11: బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శశికుమార్ ఆధ్వర్యంలో వాకర్స్‌కు ఉచిత బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యుడు కొర్రాచంద్రశేఖర్, ఏకే సుందర్‌రాజ్, సత్యనారాణ చార్యులు, రామయ్య, ప్రభాకర్, పాల్గొన్నారు.

బీసీలను వెన్నుపోటు పొడిచిన జగన్: ఇంటూరి



మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం, ఫిబ్రవరి 11 : బీసీలను అన్ని విధాలుగా మోసం చేసిన జగన్మోన్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని టీడీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక వేముల అంజయ్య కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి జరిగిన జయహో బీసీ సభలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు బీసీల ఆర్థిక, సామాజిక, రాజకీయంగా ఎదుగుదలకు ఎన్నో అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. చంద్రబాబునాయుడు అనేక మంది బీసీలకు మంత్రి పదవులు ఇచ్చి గౌరవించడంతో పాటు ప్రతి ఏడాది బడ్జెట్లో అధికంగా నిధులు కేటాయించారని తెలిపారు. వైసీపీ పాలనలో బీసీలను ఎన్నో అవమానాలకు గురి చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే దివి శివరాం మాట్లాడుతూ గత ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని నమ్మి ఓటేసి పెద్ద తప్పు చేశారని, ఈ సారి అలాంటి తప్పు చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, జనసేన మండల అధ్యక్షుడు అంగుళూరి నరసింహారవు, నాయకులు ముచ్చు కృష్ణయ్య, టి ముసలయ్య, షేక్ సలాం, మద్దెల రామారావు, ఎన్ నారాయణ, అడపా రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ : మండలంలోని అన్నెబోయినపల్లిలో ఎన్టీ రామారావు విగ్రహం టీడీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం భూమి పూజ చేశారు. ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావును, టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావును గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి మాల్యాద్రి, బి రామయ్య, బాసం హరిబాబు, ఎండోటి ప్రసాద్, బి రమణయ్య, జి సాంబయ్య, జి ప్రసాద్, కె మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

కావలి అభివృద్ధికి కృషి చేస్తా : కావ్య



కావ్యను అభినందిస్తున్న శానం హరి, తదితరులు

కావలి, ఫిబ్రవరి 11: తాను పేద కుటుంబం నుంచి వచ్చినందున ప్రజల కష్టాలు తెలుసని, వారి సమస్యలు పరిష్కరిస్తూ కావలి అభివృద్ధికి కృషి చేస్తానని టీడీపీ ఇన్‌చార్జి కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయనను పలువురు కలసి అభినందించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం మీకు అందుబాటులో ఉండి ఏ కష్టం వచ్చినా ఆదుకుంటానని, కావలిలో తనను గెలిపించి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేసేందుకు కృషి చేయాలన్నారు. అలాగే 18వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి శానం హరి ఆధ్వర్యంలో సుమారు 500 మందికి పైగా ఆ వార్డు ప్రజలు వెంగళరావునగర్ నుంచి ర్యాలీగా ముసునూరు వచ్చి ఆయనకు మద్దతు తెలిపారు. అదేవిధంగా 6వ వార్డుకు చెందిన టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి సంపాని ప్రసాద్ ఆధ్వర్యంలో, 22వ వార్డు ఇన్‌చార్జి కుందుర్తి కిరణ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అభిమానులు ముసునూరులోని కృష్ణారెడ్డి ఇంటికి వచ్చి మద్దతు తెలిపారు.

కన్యకాపరమేశ్వరికి పూజలు : వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు కృష్ణారెడ్డి కన్యకాపరమేశ్వరి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ వనితా లెజెండ్ మహిళలు ఆయనకు స్వాగతం పలికారు. తొలుత పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు కందుకూరు వెంకటసత్యనారాయణ, పోతుగంటి అలేఖ్య, సీవీసీ సత్యం, తటవర్తి వాసు, తటవర్తి రమేష్, మోడరన్ నరసింహం, కటకం రాము, చవల రామకృష్ణ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ఒక్క వాటర్ ట్యాంకైనా నిర్మించారా?

● మండల మీట్‌లో టీడీపీ సర్పంచు



మాట్లాడుతున్న సర్పంచు వెంగపనాయుడు

కలిగిరి, ఫిబ్రవరి 11: వైసీపీ పాలనలో నియోజకవర్గంలో ఏ గ్రామంలోనైనా తాగునీటి సరఫరాకు ఒక్క వాటర్ ట్యాంకైనా నిర్మించారా.. అని మండలంలోని రావులకొల్లు పంచాయతీ టీడీపీ సర్పంచు పూసాల వెంగపనాయుడు ప్రశ్నించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశాం అంటున్నారు.. కానీ గ్రామాల్లో గుక్కెడు తాగునీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. టీడీపీ సర్పంచులు ఉన్న పంచాయతీలకు నిధులు విడుదల చేయడంలో, పనులు మంజూరు చేయడంలోనూ పక్షపాత ధోరణి చూపుతున్న ఈ ప్రభుత్వానికి నూకలు చెల్లిపోయాయని, రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని, వైసీపీకి వంత పాడుతున్న అధికారులు మూ ల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఎంపీపీ మెట్టుకూరు శిరీష మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు మంజూరైన నిధులతో సర్పంచులు, అధికారులు సమన్వయంతో అభివృద్ధి పనులు చేసుకోవాలన్నారు. రానున్నది వేసవి కాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. జడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, మండల విస్తరణాధికారి వెలుగోటి మధు మాట్లాడారు. ఈ సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

కావలి, ఫిబ్రవరి 11: తెలుగు సంస్కృతికి ప్రతీక ఉగాది పండుగ సందర్భంగా శ్రీక్రోధినామసంవత్సర కాలమానం ప్రకారం రూపొందించిన కాలెండర్‌ను విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ముసునూరు హనుమక్షేత్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వహిందూపరిషత్ దక్షిణప్రాంత సహ కార్యదర్శి పీ.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉగాది నుంచి తెలుగు సంవత్సరాది చైత్రశుద్ధ పాడ్యమితో కొత్త సంవత్సరం ప్రాంభమవుతోందన్నారు. నగర అధ్యక్షుడు వేదగిరి సూర్యనారాయణ ఉగాది విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ బాధ్యులు కొండూరు వెంకటేశ్వర్లు, కోటా సురేంద్రరెడ్డి, కొనసం సంజీవయ్య, గునిపూడి సుబ్బరాయుడు, కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, పల్లకీ, లోకేశ్వర్‌రెడ్డి, ఇంటూరు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : బొల్లినేని

కొండాపురం, ఫిబ్రవరి 11: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉదయగిరి ఇన్‌చార్జి బొల్లినేని వెంకట రామారావు అన్నారు. ఆదివారం కలిగిరిలోని తన కార్యాలయంలో బొల్లినేనిని ఉప్పలూరు సర్పంచు కొండలరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్య, మండల క్లస్టర్ ఇన్‌చార్జి చెరుకూరు వెంకటాద్రి, ఉప్పలూరు యూనిట్ సభ్యుడు కుమ్మర వెంకటరావు పాల్గొన్నారు.

పేద వృద్ధులను ఆదుకోవడం ప్రశంసనీయం

కావలి, ఫిబ్రవరి 11: డీఆర్ విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో పేద వృద్ధులను ఆదుకోవడం ప్రశంసనీయమని కావలి సబ్‌జైలు సూపరింటెండెంట్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆ సేవా సమితి ఆధ్వర్యంలో వెంగళరావులోని వారి కార్యాలయంలో ఆదివారం 60 మంది వృద్ధులకు నిత్యావసర సరుకులు, ప్యాకెట్ మనీ కింద కొంత నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్‌రెడ్డి, సేవాసమితి డైరెక్టర్ తాతిరెడ్డి, సభ్యులు సతీష్‌సింగ్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఆర్ డీగ్రీ కళాశాలలో 14న న్యాక్ బృందం పర్యటన

కందుకూరు, ఫిబ్రవరి 11 : టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 14, 15 తేదీల్లో న్యాక్ బృందం పర్యటిస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని వసతులు, బోధనా పద్ధతులను పరిశీలిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా 14న పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థుల అభిప్రాయాల ఆధారంగా కళాశాల గ్రేడ్‌ను నిర్ణయిస్తారన్నారు. కళాశాలకు మంచి గ్రేడ్ రావడానికి పూర్వ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు న్యాక్ బృందంతో జరిగే సమావేశంలో పాల్గొని కళాశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని ప్రిన్సిపాల్ కోరారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేత

కావలి రూరల్, ఫిబ్రవరి 11: మండలంలోని సర్వాయపాలెం పంచాయతీ కోనేటివారిపాలెంకు చెందిన వైసీపీ నేత తాతా నాగరాజు ఆదివారం వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ మండల కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు ఆధ్వర్యం టీడీపీ కావలి నియోజక వర్గ ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి నాగరాజుకు పార్టీ కండువ కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ, ఎంపీటీసీ జంపాని శీనయ్య, మాజీ సర్పంచు ఉప్పాల వెంకయ్య, నాయకులు తాతా యానాది, జంపాని కల్యాణ్, పెనుబాపల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

కావలిటౌన్, ఫిబ్రవరి 11: శ్రీధర్ మల్టీ స్పెషాలిటీ చిన్నపిల్లల ఆసుపత్రి నిర్వాహకులు శ్రీధర్, రూస్సీ దంపతులు తమ కుమారుడు జనిత్ జన్మదిన వేడుకలను ఆదివారం పేద గిరిజనుల మధ్య నిర్వహించారు. వారికి అన్నదానం చేశారు. సంయుక్త సేవా సంస్థ పర్యవేక్షణలో బుడమగుంట గిరిజన కాలనీలో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో సంయుక్త సంస్థ అధ్యక్షుడు సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

● ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి



రిబ్బన్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి

కావలిటౌన్, ఫిబ్రవరి 11: పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కావలి ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రూ.20కోట్లతో నూతనంగా నిర్మించిన భవనాలను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. జాతీయ రహదారి పక్కన మరో ఆసుపత్రి రూ.70 కోట్లతో నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ పద్మావతి, విశ్రాంత సూపరింటెండెంట్ కె సుబ్బారావు, ఆర్ఎంవో ప్రమీల, వైద్యాధికారులు, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయకండి

లింగసముద్రం, ఫిబ్రవరి 11 : విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అని.. పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయవద్దని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 26 వేల ఎకరాలలో విస్తరించి, ఏటా 7.3 మిలియన్ టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేస్తూ దాదాపు 16 వేల మంది శాశ్వత ఉద్యోగులు, 17,500 మంది కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పిస్తుందని తెలిపారు. దాదాపు లక్ష మంది పరోక్షంగా ఈ ప్లాంటు ద్వారా లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ ఉక్కు కర్మాగారానికి ఇనుప ఖనిజం కేటాయించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే విభజన ద్వారా నష్టపోయిన ఏపీకి సహాయ సహకారాలు అందించాలని పేర్కొన్నారు.

సచివాలయ, ఆర్‌బీసీ భవనాల ప్రారంభం



భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఉలవపాడు, ఫిబ్రవరి 11 : మండలంలోని కరేడు పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన సచివాలయం 3, రైతు భరోసా కేంద్రాల భవనాలను ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఆదివారం ప్రా రంభించారు. కరేడు పంచాయతీలో మూడు సచివాలయాలు ఉండగా రెండు కరేడు గ్రామంలోనే నిర్మించారు. 3వ సచివాలయం అలగాయపాలెంలో నిర్మాణం పూర్తయింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ చేవూరి అరుణ, ఎంపీపీ వాయిల మస్తానమ్మ, స్థానిక ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీనదయాళ్‌కు ఘన నివాళి



కందుకూరు: నివాళులర్పిస్తున్న నాయకులు



కావలిటౌన్ : నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

కందుకూరు, ఫిబ్రవరి 11 : పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ పుణ్యతిథి కార్యక్రమాన్ని పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం జరుపుకున్నారు. నియోజకవర్గ సమన్వయకర్త ఘట్టమనేని హరిబాబు దీనదయాల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కో కన్వీనర్ జొన్నాదుల సురేష్, పట్టణ అధ్యక్షుడు మన్నేపల్లి వరప్రసాదరావు, రూరల్ అధ్యక్షుడు చల్లా వెంకటరాజా, తదితరులు పాల్గొన్నారు.

కావలిటౌన్ : బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నమస్కార్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ పుణ్యతిథి సందర్భగా ఆయన చిత్రపటానికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు కె బ్రహ్మానందం, నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు కందుకూరి సత్యనారాయణ, సీపీవీ సత్యం, కామినేని ఉదయలక్ష్మి, మంద కిరణ్, మస్తాన్, వెంకటరెడ్డి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పోలేరమ్మకు పొంగళ్లు

పొదలకూరు, ఫిబ్రవరి 11 : పొదలకూరు మేజర్ పంచాయతీ పరిధిలోని చిట్టేపల్లి గ్రామస్థులు మంగళవారం పొదలకూరు గ్రామదేవత పోలేరమ్మకు పొంగళ్లు పెడుతున్నట్లు గ్రామపెద్దలు కోవూరు బక్కయ్యనాయుడు, గొర్ల సుధాకర్‌నాయుడు, కామినేని మల్లికార్జున్‌నాయుడు, బెల్లంకొండ మస్తానయ్య తెలిపారు. చిట్టేపల్లి నుంచి పొదలకూరు పోలేరమ్మ ఆలయానికి ఊరేగింపుగా వచ్చి నైవేద్యాలను సమర్పించనున్నట్లు వెల్లడించారు. సంక్రాంతి తర్వాత వచ్చే ఐదవ మంగళవారం రోజున ఏటా ఈ గ్రామ పొంగళ్లు పెడుతున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్లు, సైడ్ కాలువల ప్రారంభం

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 11: మండలంలోని వరకవిపూడి పంచాయతీ అనంతపురం గ్రామంలో ఆదివారం సీసీ రోడ్లు, సైడ్ కాలువలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జడ్పీటీసీ శేషమ్మ, నాయకులు ఇసనాక రమేష్‌రెడ్డి, ఉప్పల శంకరయ్య గౌడ్, చిరంజీవి గౌడ్, వివిధ గ్రామాల నుండి నాయకులు పాల్గొన్నారు.

రాపూరులో టీడీపీని బలోపేతం చేస్తా



సొసైటీ మాజీ అధ్యక్షుడికి కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

రాపూరు(డక్కిలి), ఫిబ్రవరి 11: రాపూరులో తెలుగుదేశం పార్టీ మరింత బలపడేందుకు తనవంతు కృషిచేస్తానని మాజీ సొసైటీ అధ్యక్షుడు శ్రీహరిరెడ్డి అన్నారు. వైసీపీలో కొనసాగుతున్న ఆయన ఆదివారం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాపూరులో తెలుగుదేశం పార్టీ పటిష్టంగా వుందన్నారు. రానున్న ఎన్నికల్లో రాపూరు మండలం నుంచి టీడీపీలోకి మరిన్ని వలసలు వుంటాయని చెప్పారు. ఇప్పటికే అనేక మంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. రామకృష్ణ నాయకత్వంలో పనిచేసేందుకు పలువురు ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు.

ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలి



పార్లపాడులో మహిళకు ఆరు పథకాల గురించి వివరిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

మనుబోలు, ఫిబ్రవరి 11 : మండలంలోని మడమనూరు పంచాయతీ పరిధిలోని పార్లపాడు గ్రామంలో ఆదివారం తెలుగుతమ్ముళ్లు బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇంటింటా కరపత్రాలను అందించి టీడీపీ ఆరు పథకాల గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య, మస్తాన్‌నాయుడు, మధునాయుడు, వచ్చిపాల రామిరెడ్డి, సాని వెంకటరమణయ్య, సంజీవనాయుడు, చిట్టిబాబు, సురేష్ పాల్గొన్నారు.

అక్కంపేటలో ఉన్నత పాఠశాల ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి కాకాణి

మనుబోలు, ఫిబ్రవరి 11: మండలంలోని అక్కంపేట గ్రామంలో నిర్మించిన నూతన ఉన్నత పాఠశాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి తన సొంత నిధులు కోటి రూపాయలు పాఠశాల వసతులకు ఇవ్వడంతో ప్రభుత్వం ఆయన తండ్రి నారపరెడ్డి సీతారామిరెడ్డి పేరు మీద పాఠశాలను మంజూరు చేసింది. ముందుగా మంత్రి కాకాణి నారపరెడ్డి సీతారామిరెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల గదులను ప్రారంభించి కిరణ్‌కుమార్‌రెడ్డిని అభినందించారు. అనంతరం గ్రామంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నారపరెడ్డి జాంబవతమ్మ, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, వైసీపీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కక్ష సాధింపులు తప్ప అభివృద్ధి లేదు

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ

పొదలకూరు, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో కక్ష సాధింపు చర్యలు తప్ప అభివృద్ధి లేదని మాజీ మంత్రి పొంగూరు నారాయణ విమర్శించారు. ఆదివారం పట్టణంలోని బోగోలు కృష్ణారెడ్డి కల్యాణ మండపంలో మండలంలోని ఊసపల్లి గ్రామానికి చెందిన కొత్తలూరు శివకోటి - దీప్తిల వివాహానికి హాజరైన నారాయణ దంపతులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తన ఇల్లు, ఆసుపత్రి, అఖరికి జిమ్‌లో కూడా డ్రగ్ కంట్రోలర్ అధికారులు సోదాలు నిర్వహించారన్నారు. ఆ సోదాల్లో అన్నీ సక్రమంగా ఉన్నాయని వారే తెలిపారని, తనని భయపెట్టడానికి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని, తాను భయపడేవాడిని కానన్నారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని తగిన సమయంలో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. రాబోవు ఎన్నికల్లో మంచి మెజార్టీతో టీడీపీ - జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పొంగూరు వెంకటసుబ్బయ్య, కామాక్షి, కొత్తలూరు శంకరయ్య, ఉమామహేశ్వరి, భాస్కర్, తోట మల్లికార్జున్, టీడీపీ నాయకులు బోగోలు భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

యునాని వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధుల దూరం

ఆత్మకూరు, ఫిబ్రవరి 11 : అతి ప్రాచీనమైన యునాని వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతున్నాయని ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి పద్మావతి తెలిపారు. స్థానిక ప్రభుత్వ యునాని వైద్యశాలలో ఆదివారం జాతీయ యునాని డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ఆత్మకూరులోని యునాని వైద్యశాల ఎంతోమంది రోగులకు మెరుగైన సేవలు అందిస్తోందన్నారు. ముందుగా పట్టణంలో యునాని వైద్యంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ప్రభుత్వ యునాని వైద్యశాల వైద్యులు డాక్టర్ ఎండి అబ్దుల్ రజాక్, మహిమలూరు పీహెచ్‌సీ డాక్టర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించండి

● టీడీపీ నేతల ప్రచారం



సోమిరెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు

వెంకటాచలం, ఫిబ్రవరి 11: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సర్వేపల్లి నుండి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేస్తున్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణమనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఈపూరు మురళీధర్‌రెడ్డి, రైతు విభాగం జిల్లా అధికార ప్రతినిధి ఈపూరు సుబ్బారెడ్డి కోరారు. మండలంలోని గూడ్లూరువారిపాళెంలో ఆదివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించి టీడీపీకి ఓటువేసి సోమిరెడ్డిని ఆదరించాలని కోరారు. అలాగే టీడీపీ ప్రకటించిన మినీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా సోమిరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో చల్లా నాగార్జున్‌రెడ్డి, వలిపి మునుస్వామి, రావూరి పద్మనాభనాయుడు, నిక్కుదల రమేష్, దువ్వూరు లక్ష్మమ్మ, దాసి చక్రధర్, యనమల రాజేంద్ర, కరుణాకర్‌రెడ్డి తదితరులున్నారు.

భూ పోరాటాలు సీపీఎంకే సాధ్యం



భూముల్లో జెండాలు పాతుతున్న సీపీఎం నాయకులు

తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 11 : పోరాటాల ద్వారా భూ సమస్యల పరిష్కారం సీపీఎంకే సాధ్యమని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం మండలంలోని టీపీగూడూరు బిట్ - 2 పాపిరెడ్డిపాళెం గ్రామంలోని సర్వే నెంబర్లు 497, 498లలో ఉన్న పదిహేను ఎకరాల మిగులు భూమిని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకొని జెండాలు పాతి 500 మంది పేదలకు ఇళ్ల స్థలాలకు హద్దులు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాల నుండి ఇళ్ల స్థలాల కోసం పోరాడుతున్నామని, ఇప్పటికి కల నెరవేరిందన్నారు. అధికారంలో ఉన్న మంత్రి కాకాణి పేదలకు ఒరగపెట్టింది ఏమీ లేదన్నారు. వైసీపీ చోటా నాయకుడు ఈ భూమిపై కన్నేసి దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని, ఈ భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అనంతరం భూమిలో జెండాలు పెట్టి హద్దులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమ్మరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళ పుల్లయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, నాయకులు ఆలూరు తిరుపాలు, కేరవణమ్మ, మధు, రామచంద్రయ్య, వేగురి వెంకయ్య, అల్లాడి గోపాల్, బట్ట పెద్దబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ మహోత్సవం



కలశాలతో అమ్మవారి భక్తులు

పొదలకూరు, ఫిబ్రవరి 11 : పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారి ఆత్మార్పణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత 108 మంది మహిళలు కలశములతో అమ్మవారి దేవాలయం నుండి శివాలయం వరకు వెళ్లి అక్కడినుంచి కలశములతో నీటిని, అమ్మవారిని పల్లకిలో ఊరేగించారు. ఆ కలశ జలములతో అమ్మవారికి పంచామృత అభిషేకం, లలితా హోమము, సహస్రనామ పారాయణం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం, తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఉభయకర్తలుగా ఆకులూరు మధు - నీరజ, హేమంత్‌కుమార్ - అనురాధ, రాజా సుబ్బారావు - సుజాత, సురేంద్రబాబు, లక్ష్మీనారాయణ, సాయికుమార్, ఆర్యవైశ్య మండలాధ్యక్షుడు తన్నీరు సురేష్, రాచపూడి ధనుంజయరావు, వీరప్రకాశం, దేవాలయ వ్యవస్థాపక పాలక మండలిసభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మనుబోలు, ఫిబ్రవరి 11 : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983- 87 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సమ్మేళనానికి వివిధ దేశాలు, రాష్ట్రాల్లో ఉన్న పూర్వ విద్యార్థులంతా హాజరయ్యారు. అలనాటి చదువుచెప్పిన ఉపాధ్యాయులను తీసుకొచ్చి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత పాఠశాల కోసం తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సమ్మేళనంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.

చెల్లాయపాళెంలో వైద్య శిబిరం

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని చెల్లాయపాళెం ధరణి అవెన్యూలో మనవూరు, మన పిల్లలు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ ఉదయ్‌కుమార్, డాక్టర్ అవినాష్, డాక్టర్ వెంకట సుష్మా, డాక్టర్ రామనాథరెడ్డి, డాక్టర్ దత్త ప్రసాదరెడ్డి, డాక్టర్ సహనలు పాల్గొని చెల్లాయపాళెంతోపాటు బుచ్చిరెడ్డిపాళెం, రేబాల గ్రామాల నుంచి వచ్చిన సుమారు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. గ్యాస్టిక్ సమస్యతోపాటు పలు వ్యాధులకు నిర్వాహకులు ఆయుర్వేద మందులు సైతం పంపిణీ చేశారు. నిర్వాహకుడు విజయ్‌కుమార్, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్

కోవూరు, సర్వేపల్లి

జై వాసవి!!

● వైభవంగా కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం





సింహ వాహనంపై వాసవీ దేవి, అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 11 : ఆర్యవైశ్యుల కుల దైవం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 6 గంటలకు పెన్నా నదీ జలాలను రంగనాథ స్వామి ఆలయ ఘాట్ నుంచి కలశాలలో సేకరించారు. వాటిని మంగళవాద్యాలతో ఊరేగింపుగా కన్యకాపరమేశ్వరి ఆలయానికి చేర్చారు. అనంతరం ఆలయంలో విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారికి పెన్నానది నుంచి తెచ్చిన జలాలతో కుంభ సంప్రోక్షణ చేశారు. సాయంత్రం కన్యకా, సువాసినీ పూజలు జరిగాయి. అనంతరం అమ్మవారిని వెండి సింహ వాహనంపై ఆలంకరించి పల్లకిసేవ నిర్వహించారు. జై వాసవీ.. జైజై వాసవీ అనే నామ స్మరణతో భక్తులు నిప్పుల గుండం తొక్కారు. ఈ ఉత్సవానికి ముఖ్య అతిథిగా ఆలయ గౌరవాధ్యక్షుడు, నూడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ హాజరయ్యారు. ఆలయ చైర్మన్ శ్రీరామ్ సురేష్, ధర్మకర్తలు పర్యవేక్షించారు.

టీడీపీలో భారీ చేరికలు

● కండువాలు కప్పి ఆహ్వానించిన కోటంరెడ్డి



పార్టీలో చేరిన వారితో కోటంరెడ్డి సోదరులు

నెల్లూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ రూరల్ నియోజకవర్గంలో ఆదివారం భారీ చేరికలు జరిగాయి. పదకొండు డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కండువాలు కప్పి స్వాగతం పలికారు. 17వ డివిజన్‌కు చెందిన ఉప్పు చెంచు రామయ్య, వారి మిత్రబృందం టీడీపీలో చేరింది. 24వ డివిజన్‌కు చెందిన సీపీఎం నేతలు బీమతాటి సుధాకర్, బీమతాటి సుధీర్, వారి అనుచరులు టీడీపీ కండువా కప్పుకున్నారు. 32వ డివిజన్‌కు చెందిన స్థానికులు పెద్ద సంఖ్యలో సైకిల్ ఎక్కారు. 29వ డివిజన్ గాంధీనగర్‌కు చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మల్లేశ్వరరావు, సీపీఎం నేత షఫీ, ఖాదర్ తదితరులు టీడీపీలో చేరారు. 31వ డివిజన్ రామకోటయ్య నగర్‌లో షేక్ షఫీ, షేక్ పఠాన్ జాకీర్, పసుపులేటి రాఘవులు, అనిల్, గజ్జల రాము, బొమ్ము కోటేశ్వరరావులతోపాటు భారీగా యువత టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల చూపంతా టీడీపీ-జనసేన వైపే ఉందని చెప్పారు. సామాన్య, మధ్య తరగతి ప్రజల్లో వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా.. అరాచక ప్రభుత్వాన్ని దించేద్దామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు ఉరందూరు సురేంద్రబాబు, సాబీర్ ఖాన్, మన్నేపల్లి రఘు, బూడిద పురుషోత్తం యాదవ్, ఊటుకూరు దత్తాత్రేయ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రానికి పూర్వ వైభవం : రమేష్‌రెడ్డి



ప్రచారంలో నాయకులతో రమేష్‌రెడ్డి

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 11 : రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే అది టీడీపీతోనే సాధ్యమని మాజీ మంత్రి, టీడీపీ నేత తాళ్లపాక రమేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని 3వ డివిజన్ జాఫర్ సాహెబ్ కాలువ కట్ట ప్రాంతంలో పొంగూరు నారాయణ తరపున ప్రచారం చేశారు. సిద్ధం సిద్ధం అంటూ సీఎం జగన్మోహన్‌రెడ్డి వస్తే వైసీపీని గద్దెదించేందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలు మార్పు కోరుతున్నారని టీడీపీ-జనసేన ప్రజా ప్రభుత్వం కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు.

రాజధాని లేకుండా పాలనేమిటి..?

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ



చిరు వ్యాపారికి తోపుడు బండి అందజేస్తున్న నారాయణ

నెల్లూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రాజధాని అనేది లేకుండా పాలన సాగించడమేమిటని మాజీ మంత్రి పొంగూరు నారాయణ ప్రశ్నించారు. రాజధాని నిర్మించకుండా అరాచక పాలన సాగిస్తున్న జగన్మోహన్‌రెడ్డికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారన్నారు. ఆదివారం నగరంలోని 13వ డివిజన్ కొరివారికండ్రిగ, వడ్డిపాలెం ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. చిరు వ్యాపారాలు చేసుకునే మహిళలకు తోపుడు బండ్లు అందజేసి దాతృత్వం చాటుకున్నారు. ఇంటింటికి తిరుగుతూ బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రంతోపాటు నెల్లూరు నగరం అభివృద్ధి చెందాలంటే చంద్ర బాబు సీఎం కావాలన్నారు. ప్రపంచంలోనే మేటి రాజధాని నిర్మించాలని టీడీపీ ప్రభుత్వంలో డిజైన్ చేస్తే నేడు నాశనం చేశారని విమర్శించారు. కాగా కాప్స్ రాక్స్ టీం సభ్యులు ఆదివారం రాత్రి నారాయణను కలిశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాప్రభుత్వం ఏర్పాటుకు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

జగన్ పేరెత్తితేనే జనాలకు చిర్రెత్తుకొస్తోంది

● జనసేన అధ్యక్షుడు మనుక్రాంత్



స్థానికులతో మాట్లాడుతున్న మనుక్రాంత్ రెడ్డి

నెల్లూరు(స్టోన్ హౌస్ పేట), ఫిబ్రవరి 11 : వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల ఆదాయ వనరులు తగ్గడం, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడం, కరెంట్ చార్జీలు షాక్ కొట్టేల ఉండటంతో జనాలకు జగన్ పేరెత్తితే చిర్రెత్తుకొస్తోందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి అన్నారు. నగరంలోని 53వ డివిజన్ గాంధీగిరిజన సంఘంలో ఆదివారం నిర్వహించిన జనం కోసం జనసేన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ప్రభంజనం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, నాయకులు షేక్ ఆలియా, జీవన్, ప్రతాప్, శ్రీకాంత్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను బానిసలుగా చేసి వైసీపీ పాలన

● బీసీలను బ్లాక్‌మెయిల్ చేసేందుకు కులగణన

● కోవూరు టీడీపీ అభ్యర్థి పోలంరెడ్డి దినేష్‌రెడ్డే

● మాజీ మంత్రి కొల్లు రవీంద్ర



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

కోవూరు, ఫిబ్రవరి 11 : ప్రజలను బానిసలుగా చేసి వైసీపీ పాలన సాగించేందుకు ప్రయత్నిస్తుందని మాజీ మంత్రి, టీడీపీ సాధికార కమిటీ చైర్మన్ కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కోవూరుకు సమీపంలో జాతీయరహదారి పక్కన ఆదివారం ఏర్పాటు చేసిన జయహో బీసీ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ టీడీపీలో యువతకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అందులో భాగంగా తెలుగు యువత ప్రధానకార్యదర్శి పోలంరెడ్డి దినేష్‌రెడ్డిని కోవూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఎప్పుడో ప్రకటించారని, ఆయనను గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. బీసీలను బ్లాక్ మెయిల్ చేసి ఓట్లు దండుకునేందుకే కులగణన చేపట్టారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీల కోసం రక్షణ చట్టాన్ని తీసుకువస్తుందన్నారు. బీసీలకు లబ్ధి చేకూర్చేందుకు చట్టాల రూపకల్పనకు టీడీపీ నాయకత్వం 54 సాధికార కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. పార్టీ నాయకులు అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు, యనమల రామకృష్ణుడుతోపాటు తనపై అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేయాలని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి కుట్రపన్నారని చెప్పారు. రాష్ట్రంలో అరాచకాలు పెరిగాయని, నియంతగా ప్రవరిస్తున్న వైసీపీ విధానాలపై తిరగబడి గద్దె దించాలని పిలుపునిచ్చారు. టీడీపీ జాతీయప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర మాట్లాడుతూ మాజీ మంత్రి అనిల్ కుమార్‌యాదవ్, రాజ్యసభ సభ్యుడు బీద మస్తానరావు జిల్లా అభివృద్ధికి ఏమి చేశారో చెప్పాలని నిలదీశారు. బీద మస్తానరావు ఢిల్లీలో తమ నాయకుడు చంద్రబాబు నాయుడ్ని విమర్శించడం పద్ధతి కాదన్నారు. బీసీ భవనం నిర్మించడంలో ఈ ఇద్దరూ నిర్లక్ష్యం చేశారని చెప్పారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి మాట్లాడుతూ బీసీల సంక్షేమం కోసం కృషి చేసే పార్టీ టీడీపీ ఒక్కటేనన్నారు. జయహో బీసీ సభలో మాజీ ఎమ్మెల్యేలు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నెలవల సుబ్రహ్మణ్యం, జడ్పీ మాజీ చైర్మన్ పీ చెంచలబాబు యాదవ్, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధాకృష్ణయ్య, జనసేన జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి, ఆప్కాబ్ మాజీ చైర్మన్ పోలిశెట్టి, టీడీపీ నాయకులు చెముకుల కృష్ణచైతన్య, కప్పిర శ్రీనివాసులు, పిచ్చుక మధుసూదనరావు, వీరేంద్ర, చెముకుల శ్రీనివాసులు పాల్గొన్నారు

కన్యకాపరమేశ్వరికి కలశాభిషేకం

● 108 కలశాలతో మహిళల ఊరేగింపు



108 కలశాలతో ప్రదర్శనగా ఆలయానికి వెళ్తున్న మహిళా భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 11: బుచ్చిరెడ్డిపాళెంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ఆదివారం కలశాభిషేకం వైభవంగా జరిగింది. 108 కలశాలను శిరస్సున పెట్టుకుని మహిళా భక్తులు చెన్నూరురోడ్డులోని వినాయకుడి గుడి నుంచి బస్టాండ్ సెంటర్ వరకు అక్కడి నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. అనంతరం ఓ ప్రధాన కలశంలోని జలాలతో అమ్మవారి గర్భాలయ గోపుర కలశాన్ని వేదమంత్రాలు, మంగళమేళాలతో శాస్త్రోక్తంగా అభిషేకించారు. అలాగే మిగిలిన కలశాలలోని జలాలతో వాసవీ కన్యకాపరమేశ్వరికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు నరసింహులు, బాలు, సభ్యులు పాల్గొన్నారు.

చైతన్యపురి పార్కులో రక్తదాన శిబిరం


నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 11 : నగరంలోని వేదాయపాళెం చైతన్యపురి పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పార్కు ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ కార్యదర్శి కొండూరు సుబ్బారావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సహకారంతో నిర్వహించిన శిబిరంలో స్థానిక యువత, వాకర్స్ పాల్గొని రక్తదానం చేశారన్నారు. ముందుందు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు, అసోసియేషన్ నేతలు డాక్టర్ దయాకర్‌రావు, సాయి సునీల్, మహేష్, మాలేపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా బీవీ రమణయ్య కళానీరాజనం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 11 : నెల్లూరులోని పురమందిరంలో ఆదివారం ఏవీకే ఫౌండేషన్, కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూరాజ్యలక్ష్మి, శుభమస్తు షాపింగ్ మాల్ వ్యవస్థాపకుడు బీవీ రమణయ్య స్మారక కళా నీరాజనం కార్యక్రమం జరిగింది. ఉదయం పాటలు, నృత్య పోటీలు నిర్వహించారు. సాయంత్రం సుస్వర ఆర్కెస్ట్రా, లక్ష్మి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో జరిగిన సంగీతా విభావరి ఆకట్టుకుంది. పీ రాజశేఖర్, పెంచల్‌రెడ్డిలను సత్కరించారు. పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని కేతా సుబ్బారావు, పీ ప్రదీప్, ఎన్‌వీ రమణయ్య, ఖాన్ పర్యవేక్షించారు.

లేఅవుట్‌లో స్థలం కేటాయింపుపై వివాదం

బుచ్చిరెడ్డిపాళెం,ఫిబ్రవరి11: పట్టణ పరిధిలో 2007లో ఏర్పాటైన ఓ ప్రైవేటు లేఅవుట్‌లోని పబ్లిక్ స్థలాన్ని ఓ సామాజికవర్గానికి కేటాయించడం పట్ల అక్కడి నివాసితులు వ్యతిరేకిస్తున్నారు. పబ్లిక్ స్థలంలో అందరికీ ఉపయోగపడేలా ఆసుపత్రి లేదా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలేగానీ, ఇలా ఒక సామాజికవర్గం వారికి కేటాయించడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. అయితే ఆదివారం బుచ్చిలోని ఓ కల్యాణమండపంలో నిర్వహించిన సమావేశంలో ఆ సామాజిక వర్గానికి కల్యాణ మండపం నిర్మించేందుకు ప్రస్తుతం రూ. 5లక్షలు విరాళం ప్రకటించి, ఎన్నికల తరువాత భవనం నిర్మించేందుకు నిధులు కూడా మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే ప్రసన్న చెప్పడం ఎంత వరకు న్యాయమని వారు వాపోయారు. ఈ విషయంపై చైర్‌పర్సన్ భర్త మోర్ల మురళి మాట్లాడుతూ కల్యాణ మండపం కాదు, అందరికీ ఉపయోగపడేలా కమ్యూనిటీ హాలు నిర్మాణానికి తీర్మానం చేసినట్లు తెలిపారు.



పెళ్లిసందడి

మూడు ముళ్లకు 3 నెలలదాకా ముహుర్తాలు

2వేలవరకు వివాహాలకు, గృహప్రవేశాలకు అవకాశం

కళ్యాణ మండపాలకు, ఫంక్షన్ హాళ్లకు పెరిగిన గిరాకీ



తిరుపతి సిటీ, ఫిబ్రవరి 11: మాఘమాసం శనివారం మధ్యాహ్నం నుంచీ మొదలైపోవడంతో జిల్లావ్యాప్తంగా వివాహాల ఏర్పాట్లు జోరందుకున్నాయి.పెళ్లిళ్లకు ఈ నెల 13న ముహూర్తం మొదలై ఏప్రిల్ 26 వరకు దాదాపు 30 ముహూర్తాలు ఉన్నట్లు పంచాంగవేత్తలు చెబుతున్నారు. ఏప్రిల్ 28 నుంచి మూఢం మొదలవుతుంది. వైశాఖ, జ్యేష్ఠ మాసాల్లో ముహూర్తాలు లేవు. ఆ తరువాత ఆషాఢ మాసం పెళ్లిళ్లకు పనికిరాదు. మళ్లీ ఆగస్టులో శ్రావణ మాసం వచ్చేవరకూ పెళ్లి ముహూర్తాలు లేకపోవడంతో ఓ పక్క వివాహాలు,మరో పక్క గృహప్రవేశాల సందడి ఊపందుకుంది.ఈ మూడు నెలల్లో జిల్లావ్యాప్తంగా రెండు వేలకు పైగా వివాహాలు జరగనున్నాయి. వీటితోపాటు గృహప్రవేశాలు, భూమిపూజలు, బారసాలలు వంటి కార్యక్రమాలు మరో వెయ్యికి పైగా జరగనున్నాయి. దాదాపు నాలుగు నెలల విరామం తరువాత మంచి ముహూర్తాలు రావడంతో జిల్లాలో ఎక్కడ చూసినా కళ్యాణ మండపాల్లో నో బుకింగ్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. జిల్లాలో గుర్తింపు ఉన్న సుమారు 1200 కళ్యాణ మండపాలతో పాటు దేవాలయాల పరిధిలోని మరో 300కళ్యాణ మండపాలు పూర్తిగా బుక్ అయిపోయాయి.డిమాండుకు అనుగుణంగా రూ. లక్ష ఉన్న కళ్యాణ మండపాల అద్దె రూ. మూడు లక్షలకు పైగా పలుకుతోంది.చిన్నాచితకా ఫంక్షన్ హాళ్లను కూడా బుక్ చేసుకోవడంతో ఆలస్యంగా ముహూర్తాలు పెట్టుకున్న వారికి కళ్యాణ మండపాలు దొరక్క అనువుగా ఉండే ఆలయాలతో పాటు ఇళ్ల వద్ద ఎక్కడ అనుకూలంగా ఉంటే అక్కడ పెళ్లిళ్ల చేసేందుకు సిద్ధమవుతున్నారు. పురోహితులకు, ఫొటోగ్రాఫర్లకు, విడియోగ్రాఫర్లకు, బ్యూటీషియన్లకు, వంటల నిర్వాహకులకు, బ్యాండు మేళాలు, ఆర్కెస్ట్రాలతోపాటు ట్రావెల్స్ వాహనాలకు కూడా డిమాండు బాగా పెరిగిపోయింది.

మంచి ముహూర్తాల తేదీలు

- ఫిబ్రవరిలో 13, 14, 17, 18, 24, 28, 29 తేదీలు
- మార్చిలో 2, 3, 15, 17, 20, 22, 24, 25, 27, 28, 30
- ఏప్రిల్‌లో 3, 4, 9, 18, 19, 20, 21, 22, 24, 26

వివాహాల రిజిస్ట్రేషన్ ఛార్జీల భారీ పెంపు

ప్రభుత్వం ఇదే అదునుగా భావించి వివాహాల రిజిస్ట్రేషన్ ఛార్జీలను భారీగా పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం వివాహ రిజిస్ట్రేషన్ ఛార్జి రూ. 200కాగా దీన్ని రూ. 500కు పెంచారు. వివాహ వేదిక వద్దకు రిజిస్ట్రార్ వస్తే ఇప్పటివరకు రూ.210 ఫీజు వసూలు చేసేవారు. దీన్ని రూ. 5వేలకు పెంచేశారు. వివాహాల దస్త్రాల పరిశీలనకు రూపాయి వున్న ఫీజును రూ. 100కు పెంచారు. సెలవు రోజుల్లో వివాహాలను నమోదు చేస్తే రూ. 5 వేల ఫీజును నిర్ణయించారు.

తిరుపతి ఉప పోరుకు

- ఈసీ ఆదేశాలతో ఇద్దరు సీఐలు సహా ఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్
- వీఆర్‌కు ఇద్దరు సీఐలు

మరో నలుగురు బలి!

- ఎన్నికల్లో అక్రమాలపై విచారణలో నిర్లక్ష్య పర్యవసానం
- అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్ దాటిపోకూడదని ఆదేశం



సీఐలు శివప్రసాదరెడ్డి, శివప్రసాద్

సీఐలు అబ్బన్న, దేవేంద్రకుమార్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 11: తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి తాజాగా ముగ్గురు పోలీసు అధికారులు, ఓ హెడ్‌కానిస్టేబుల్ సస్పెండ్‌కాగా మరో ఇద్దరు పోలీసు అధికారులు వీఆర్‌కు బదిలీ అయ్యారు.అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా సస్పెన్షన్‌తో మొదలైన కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తాజాగా మరో నలుగురి సస్పెన్షన్‌కు కారణమయ్యాయి.2021వ సంవత్సరంలో జరిగిన తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు ఇతర ప్రాంతాల ఓటర్లను బస్సుల్లో తరలించి మరీ పోలింగ్ చేయించారు. వారికోసం ఏకంగా 34 వేల ఓటరు ఐడీ కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేయించారు.ఈ వ్యవహారాన్నంతటినీ చూసీచూడనట్టు వ్యవహరించిన పోలీసులు ప్రతిపక్షాలు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదు. పైగా కాలక్రమంలో ఆయా కేసులను కొట్టివేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన కేంద్ర ఎన్నికల కమిషన్ దర్యాప్తునకు ఆదేశించింది. పోలీసుల బాధ్యతా నిర్వహణపై దర్యాప్తుచేసిన ఉన్నతాధికారులు పలువురు పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు ఫిర్యాదులపై సక్రమంగా దర్యాప్తు చేయలేదని, ఆరోపణలు వచ్చినవారిని విచారించలేదని నిర్ధారించారు. అలాగే దొంగ ఓట్లపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయా దొంగ ఓటర్లకు చెందిన ఎపిక్ కార్డులు, ఆధార్ కార్డులు ఇతర వివరాలను కూడా సేకరించి భద్రపరచాల్సి ఉండగా అవేమీ చేయలేదని కనుగొన్నారు. ఎటువంటి విచారణ లేకుండానే ఆయా కేసులను మూసివేసినట్టు గుర్తించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అందుకు బాధ్యులైన పోలీసు అధికారులు, సిబ్బందిపై అనంతపురం రేంజి డీఐజీ చర్యలు తీసుకుంటూ ఆదేశాలు జారీ చేశారు.అప్పట్లో ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐగా పనిచేసి ప్రస్తుతం తిరుపతి ఎస్‌బీ సీఐగా పనిచేస్తున్న బీవీ శివప్రసాదరెడ్డి, ఎస్ఐగా పనిచేసి ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న ఎ.జయస్వాములు, అప్పట్లో స్టేషన్ రైటర్‌గా పనిచేసిన హెడ్‌కానిస్టేబుల్ కె. ద్వారకనాథరెడ్డి, వెస్ట్ సీఐగా పనిచేసి ప్రస్తుతం సత్యసాయి జిల్లా వీఆర్‌లో ఉన్న శివప్రసాద్‌ను సస్పెండ్ చేశారు. క్రైమ్ నంబర్ 176/2021 అండర్ సెక్షన్ 171 (ఎఫ్), 188 ఐపీసీ ప్రకారం అప్పట్లో ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి హెడ్ కానిస్టేబుల్ కె. ద్వారకనాథరెడ్డి తప్పుడు సెక్షన్లతో కేసు నమోదు చేశారని, కేసు ఇన్వెస్టిగేషన్ అధికారిగా ద్వారకనాథరెడ్డి ఫిర్యాదుదారుని, సంబంధిత పోలింగ్ అధికారులను, బీఎల్‌ఓలను, నేరం జరిగిన ప్రదేశంలో ఉన్న పోలీసు సిబ్బందిని, పోలింగ్ బూత్‌లో ఉన్న ఇతర ఓటర్లను విచారించడంలో విఫలమయ్యాడని, అలాగే నిందితుల ఓటరు ఐడీ, ఎపిక్‌కార్డులు, ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకోవడంలో నిర్లక్ష్యం వహించారని అందుకుగాను ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్టు డీఐజీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ఎస్ఐ జయస్వాములు నేరం జరిగిన ప్రదేశాన్ని సందర్శించి సాక్షులను విచారించడంలో విఫలమయ్యారని, ఐపీసీ సెక్షన్ 171(ఎఫ్) ప్రకారం నేరాన్ని నిరూపించడానికి సాక్ష్యాలను సేకరించాల్సిందిపోయి ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా కేసుకు సంబంధించిన సెక్షన్ను ఐపీసీ 290కి మార్చుచేసేందుకుగాను న్యాయస్థానంలో మెమో దాఖలు చేశారని ఉత్తర్వుల్లో వివరించారు. నకిలీ ఎపిక్ కార్డులకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన కేసులో సెక్షన్ మార్చి ఐపీసీ 290 ప్రకారం ఛార్జిషీట్ దాఖలు చేయడం దర్యాప్తు తీరు, నిబద్ధతను శంకించే విధంగా ఉందని పేర్కొన్నారు. ఇక సీఐ బీవీ శివప్రసాదరెడ్డి హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా స్టేషన్‌కు అధిపతి అయినందున కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తూ, కింది అధికారులకు మార్గనిర్దేశం చేయాలి. ఎస్‌హెచ్‌ఓ పూర్తిస్థాయిలో పరిశీలించిన తరువాత మాత్రమే కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా కేసు వాస్తవాలను పరిశీలించి, సేకరించిన సాక్ష్యాల ఆధారంగా దర్యాప్తును ధృవీకరించి, చట్టంలో తగిన సెక్షన్‌కింద ఛార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ముఖ్యమైన వ్యవహారంలో అవసరమైన స్థాయిపర్యవేక్షణను అమలు చేయడంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ బీవీ శివప్రసాద రెడ్డి విఫలమయ్యారని డీఐజీ ఉత్తర్వులో పేర్కొన్నారు. అలాగే దొంగ ఓట్లపై నమోదైన ఓ కేసుకు సంబంధించి దర్యాప్తు సక్రమంగా నిర్వహించలేదనే కారణంతో అప్పట్లో తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ సీఐగా పనిచేసి ప్రస్తుతం సత్యసాయి జిల్లా వీఆర్‌లో ఉన్న సీఐ శివప్రసాద్‌ను కూడా సస్పెండ్ చేశారు. వీరిని విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తున్నట్టు, అనుమతి లేకుండా వారు హెడ్‌క్వార్టర్స్ దాటి పోకూడదని డీఐజీ ఆదేశించారు.ఉప ఎన్నిక సమయంలో అలిపిరి పోలీస్ స్టేషన్‌లో నమోదైన మరో కేసుకు సంబంధించి దర్యాప్తు చేయకుండానే కేసును మూసివేశారనే కారణంతో ఇద్దరు సీఐలను డీఐజీ వీఆర్‌కు ఆదేశించారు. అప్పట్లో అలిపిరి సీఐగా పనిచేసి ప్రస్తుతం రేణిగుంట రైల్వే సీఐగా పనిచేస్తున్న దేవేంద్రకుమార్‌ను, ప్రస్తుతం సీఐగా ఉన్న అబ్బన్నను అనంతపురం వీఆర్‌కు బదిలీ చేశారు.



ఎస్ఐ జయస్వాములు

కోడిపందేలు ఆపమన్నందుకు

పోలీసులపై దాడి

ఎస్ఐ సహా ముగ్గురికి గాయాలు

వాకాడు, ఫిబ్రవరి 11: కోడి పందేలను ఆపమన్నందుకు పోలీసులపైనే దాడి చేసిన సంఘటన వాకాడు మండలంలో చోటు చేసుకుంది. దుగరాజపట్నం పంచాయతీ కొండూరు పాళెం మద్యంషాపు పక్కన ప్రతి ఆదివారం కోడిపందేలు నడుస్తుంటాయి.సెబ్ ఎస్ఐ జయరావు ఇద్దరు సిబ్బందితో కలిసి మఫ్టీలో ఆదివారం సాయంత్రం ఆరున్నర గంటలకు కోడిపందేలు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లారు. కోడిపందేలు ఆపివేయాలని చెప్పడంతో ఆగ్రహించిన కొండూరుపాళెం,అంజలాపురం ప్రాంతాలకు చెందిన పందెంరాయుళ్లు ఒక్కసారిగా దాడికి దిగారు.సెబ్ ఎస్ఐ జయరావుకు ముఖంపై గాయం కావడంతో కోటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. ఎస్ఐ పవన్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సత్యవేడులో సర్వేతో అలజడి

సత్యవేడు, ఫిబ్రవరి 11: అభ్యర్థి ఎంపిక విషయంపై టీడీపీ అధిష్ఠానం నియోజకవర్గాల్లో ఐవీఆర్ఎస్ సర్వే చేయిస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ నాయకుల, కార్యకర్తలకు ఫోన్ కాల్స్ వచ్చాయి. అభ్యర్థి ఎవరైతే బాగుంటుంది అంటూ అని అభిప్రాయ సేకరణ జరిపారు. సత్యవేడు టీడీపీ ఆశావహ అభ్యర్థి చందన స్రవంతి, నోటా పేర్లతో అభిప్రాయాన్ని ఫోన్ కాల్స్ ద్వారా అడిగారు. చందన కావాలంటే 1 నొక్కండి, వద్దంటే(నోటా) 2 నొక్కండి అని వచ్చిన ఫోన్ కాల్స్ చర్చనీయాంశంగా మారాయి. సాధారణంగా అభ్యర్థుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న సర్వేల్లో కనీసం ఇద్దరు, ముగ్గురు అభ్యర్థుల పేర్లుంటాయి. సత్యవేడు నాయకులకు వచ్చిన ఫోన్ కాల్‌లో ఒకే ఒక పేరును సూచిస్తూ అభిప్రాయాల సేకరణ జరపడంతో ఇది పార్టీ నిర్వహిస్తున్న సర్వే కాదని మెజారిటీ నాయకులు అభిప్రాయపడ్డారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న రాజేష్

వైసీపీకి కుదిరిన ముహూర్తం

ఎట్టకేలకు నియోజకవర్గంలో అడుగు పెట్టిన సత్యవేడు అభ్యర్థి

సత్యవేడు,ఫిబ్రవరి 11: సత్యవేడు వైసీపీలో అధినాయకత్వానికి, నియోజకవర్గ నాయకులకు మధ్య పెరిగిన గ్యాప్ కవర్ చేసుకునేందుకు ముహూర్తం కుదిరినట్లు కనబడుతోంది. పార్టీ ప్రకటించిన అభ్యర్థి నూకతోటి రాజేష్ ఎట్టకేలకు నియోజకవర్గంలో ఆదివారం అడుగుపెట్టారు. వైసీపీ అధిష్ఠానం ఇటీవల నియోజకవర్గంలో చేసిన అభ్యర్థుల మార్పు ప్రయోగం విఫలమై శ్రేణుల్లో అసంతృప్తి పెల్లుబికింది. తమను సంప్రదించకుండా, మాటమాత్రమైనా చెప్పకుండా అభ్యర్థులను మార్చిన అధిష్ఠానం నిర్ణయంపై స్థానిక నాయకులు అలకబూనారు. ఉమ్మడి జిల్లాలోని చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాలకు నూతన ఇన్‌చార్జులుగా నియమితులైన విజయానందరెడ్డి, సునీల్ కుమార్ పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుండగా సత్యవేడు ఇన్‌చార్జ్ రాజేష్ మాత్రం పది రోజులైనా నియోజకవర్గానికి రాకపోవడం, మర్యాదపూర్వకంగానైనా కలవకపోవడం నాయకుల్లో అసంతృప్తి రాజేసింది. ఈ నేపథ్యంలో పార్టీకి, నాయకులకు మధ్య చాలా గ్యాప్ ఏర్పడింది.. కొత్త అభ్యర్థి ప్రకటనతో నియోజకవర్గంలో ఏర్పడిన గందరగోళం, క్యాడర్‌లో వచ్చిన వ్యతిరేకత తదితర అంశాలను స్థానిక నాయకులు జిల్లా కీలక నేతకు వివరించి, మళ్ళీ గురుమూర్తి లేదా నారాయణస్వామిలలో ఎవరినైనా ఒకరిని ఇక్కడ అభ్యర్థిగా ప్రకటించాలని కోరినట్లు సమాచారం. అయితే రాజేష్ అభ్యర్థిత్వంలో ఇక మార్పు ఉండబోదని ఆయన తేల్చి చెప్పినట్లు వినికిడి.ఈ నేపథ్యంలో వైసీపీ అధిష్ఠానం ఓ మంచిముహూర్తం చూసుకుని నియోజకవర్గ స్థాయిలో ఆత్మీయ భేటీ నిర్వహించి రాజేష్‌ను నియోజకవర్గానికి పరిచయం చేయాలనుకుంది. ఈలోగా నియోజకవర్గంలో గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో ఖంగుతిన్న పార్టీ పెద్దలు రాజేష్‌ను హుటాహుటిన నియోజకవర్గ పర్యటనకు పంపించారు. దీంతో బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో కొద్దిమంది నాయకులతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. తన గెలుపు కోసం అందరూ కష్టపడి పనిచేసి వైసీపీ చేపట్టిన కార్యక్రమాలను ప్రజల దగ్గరకు తీసుకుపోవాలన్నారు.ఈ సమావేశానికి వైసీపీలోని ఓ వర్గం డుమ్మాకొట్టడం చర్చనీయాంశంగా మారింది.



సభలో ప్రసంగిస్తున్న షర్మిల

నగరికి నలుగురు మంత్రులట!

- జబర్దస్తీగా దోచేస్తున్నారట
- రోజాపై వైఎస్ షర్మిల ఆరోపణల వర్షం

నగరి, ఫిబ్రవరి 11: 'నగరి నియోజకవర్గంలో రోజా ఒక మంత్రి, ఆమె భర్త మరో మంత్రి, అన్నదమ్ములిద్దరు కూడా మంత్రులు. నలుగురు మంత్రులూ జబర్దస్తీగా దోచేస్తున్నారు' అంటూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి విమర్శించారు. నగరి పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద ఆదివారం సాయంత్రం నిర్వహించిన సభలో ఆమె సీఎం జగన్ పాలనా వైఫల్యాలతోపాటు మంత్రి రోజాపై విమర్శల వర్షం కురిపించారు. నగరి నియోజకవర్గంలో రాత్రికి రాత్రే కొండలు మాయమవుతున్నాయన్నారు. గ్రావెల్, మట్టి, ఇసుక ఇష్టారాజ్యంగా తరలిస్తూ రూ.వందల కోట్లు జబర్దస్తీగా దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఆఖరికి చిన్నచిన్న ఉద్యోగాల్లో సిఫార్సులకు కూడా కమీషన్లు దండుకుంటున్నారని విమర్శించారు.నిరుపేదలకు కట్టించే పక్కా గృహాల్లో సైతం రూ.వందల కోట్లు దోచుకుంటున్నారన్నారు. ఎవరైనా వెంచర్లు వేస్తే వారికి ప్లాట్లన్నా ఇవ్వాలట, కప్పం అన్నా చెల్లించాలట. వారి కన్ను పడితే ఇక అంతే ఆ ప్లాట్ల గతి అని జనమంటున్నారన్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల నుంచి నెలవారీ ముడుపులు తీసుకుంటున్నారంటూ ఆరోపించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో చేపట్టిన గాలేరు-నగరి ప్రాజెక్టు నేటికీ పూర్తికాలేదంటే జగన్‌రెడ్డికి రైతుల పట్ల ఎంత శ్రద్ధ ఉందో తెలుస్తోందన్నారు. చెరకు పరిశ్రమలను తెరిపించి రైతులను ఆదుకుంటామని నాడు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదని విమర్శించారు. మరమగ్గ కార్మికులకు ఒకనాడు 1000 రూపాయలు వచ్చే విద్యుత్ చార్జీలు ఇప్పుడు రూ.5000కు పెరిగిపోవడంతో బతకాలా? ఆత్మహత్యలు చేసుకోవాలా? అన్న స్థితిలో వున్నారన్నారు. నగరిలో కాలుష్య నివారణకు రంగునీటి శుద్ధి కోసం పెట్టిన ఈటీపీ ప్లాంట్ నడపడానికి అవసరమైన ఖర్చును కూడా భరించలేని స్థితిలో జగన్ ప్రభుత్వం వుందన్నారు. విజయా డెయిరీని తెరిపిస్తామని నాడు చెప్పి.. నేడు అమూల్ డెయిరీకి అప్పనంగా అంటగట్టారన్నారు. కాగా నగరిలో షర్మిల పర్యటనకు మంచి స్పందన వచ్చింది. సాయంత్రం 5.30 గంటలకు నగరి పట్టణ పరిధిలోని ఓంశక్తి ఆలయం నుంచి టవర్‌క్లాక్ వరకు కాంగ్రెస్ శ్రేణులతో కలసి షర్మిల ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించాక గంటన్నరకుపైగా ప్రసంగించారు. సీఎం జగన్‌తో పాటు మంత్రి రోజాపై షర్మిల విమర్శలకు కరతాళ ధ్వనులతో సభ మారుమోగింది.



నగరి ర్యాలీలో షర్మిల అభివాదం

ఓటేసి పుణ్యం కట్టుకోండి

- ఓటర్ల జాబితాలో మృతుల పేర్లపై వినూత్న నిరసన
- శ్మశానంలో సమాధుల వద్ద ఓటు వేయాలని అభ్యర్థన



చంద్రగిరి, ఫిబ్రవరి 11: చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి ఇటీవల విడుదల చేసిన తుది ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లు తొలగించకపోవడంపై పుదిపట్ల సర్పంచ్, ఓబీసీ సంఘ నేత బడి సుధాయాదవ్ వినూత్న నిరసన చేపట్టారు.ఆదివారం చంద్రగిరిలోని శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయం నుంచి ఓటరు జాబితలో చనిపోయిన వారి ఓట్లు, బోగస్ ఓట్లు తొలగించాలంటూ నినాదాలతో స్వర్ణముఖినది పరివాహక ప్రాంతంలోని శ్మశాన వాటిక వద్దకు ర్యాలీగా వచ్చారు. చంద్రగిరికి చెందిన సుశీలమ్మ, నారాయణ సమాధుల వద్దకు వచ్చి గోడ గడియారం, కుక్కరు గిఫ్టులు పెట్టి తను చంద్రగిరి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని, కావున తనకు ఓటు వేయాలని వేడుకుంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి తండ్రి, సోదరుడు మరణించినా వారి ఓట్లు తొలగించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.



క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

లారీని ఢీకొన్న బస్సు

పదిమందికి గాయాలు



ముందుభాగం దెబ్బతిన్న బస్సు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 11: నాయుడుపేట - విన్నమాల జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో పది మందికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... తిరుపతి నుంచి ఏలూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆదివారం తెల్లవారు జామున నాయుడుపేట - విన్నమాల జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని ఢీ కొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ అశోక్, ప్రయాణికులు విజయలక్ష్మి, ప్రసన్నకుమారి, విజయచాముండేశ్వరి, యశోదతో పాటు మరో ఐదుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వాహనాలు భారీగా నిలిచిపోవడంతో సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్వర్టుపై గొయ్యి... తరచూ ప్రమాదాలు



కల్వర్టుపై ఉన్న గొయ్యి

గూడూరు, ఫిబ్రవరి 11: స్థానిక నలజాలమ్మ వీధిలో కల్వర్టుపై గొయ్యి ఏర్పడడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నలజాలమ్మవీధి ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలు ఎక్కువగా సాగుతుంటాయి. రాత్రి సమయంలో గొయ్యి కనిపించక వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు లోనవుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కల్వర్టుపై గొయ్యిని పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఆమ్‌ఆద్మీ పార్టీతోనే అభివృద్ధి



ప్రచారం చేస్తున్న ఆమ్‌ఆద్మీ నేతలు

నాయుడుపేట, ఫిబ్రవరి 11: ఆమ్‌ఆద్మీ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలేటి వెంకటస్వామి అన్నారు. నాయుడుపేటలో ఆమ్‌ఆద్మీ పార్టీ సామాన్యుడి శంఖారావ ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. ఆమ్‌ఆద్మీ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు సంపూర్ణ భద్రత, ఉచిత బస్సు ప్రయాణం, యువతకు ఉపాధి, రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు, గిట్టుబాటు ధరలతో పాటు అవినీతి రహిత పాలన అందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకర్గ ఇన్‌చార్జి పట్టపు రవి, మోహన్‌రాజు, చిరంజీవి, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామీణాభివృద్ధి



బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు

పెళ్లకూరు, ఫిబ్రవరి 11: బీజేపీతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నూరిపాకల ముని సుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పెన్నేపల్లి గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గోగుతోట్టి మురళి, ప్రధాన కార్యదర్శి నరసింహయాదవ్, సుమన్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి

గూడూరు, ఫిబ్రవరి 11: బీజేపీ బలోపేతానికి యువత ముందుకు రావాలని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి అన్నారు. బీజేపీలో చేరిన యువ వ్యాపారవేత్తలు దయాకర్, రాఘవేంద్ర, సురేష్‌ను ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా పురుషోత్తమరెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు ప్రజల సంక్షేమానికి పలు కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. రానున్న ఎన్నికలలో బీజేపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోటలో బలిదాన్ దివస్



దీన్‌దయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కోట, ఫిబ్రవరి 11: కోటలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం పండిట్ దీన్‌దయాల్ బలిదాన్ దివస్ నిర్వహించారు. దీన్‌దయాల్ చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మండల పరిధిలోని ఊనుగుంటపాళెంలో పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సారంగం రమేష్‌బాబు, నాయకులు అంబరీషా, పరుశురామ్‌సాయి, వెంకయ్య, వాసు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఎన్నికలపైనా విచారణ జరగాలి

తిరుపతి, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): దేశాన్ని కుదిపేస్తున్న దొంగ ఓట్ల కుంభకోణం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమయంలోనే జరిగిందన్న అనుమానాలున్నాయని టీడీపీ 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ అభిప్రాయపడ్డారు. బోగస్ ఎపిక్ కార్డులు డౌన్‌లోడ్ ఎప్పుడు చేశారో, ఎక్కడ తయారు చేశారో విచారణ జరపాలన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లోనూ అధికార పార్టీ పెద్దఎత్తున దొంగ ఓట్లకు పాల్పడిందని, విపక్ష పార్టీలను నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకున్నారని గుర్తుచేశారు. ఏయే డివిజన్లలో అక్రమంగా ఎన్నికలు జరిగాయో వాటిని రద్దుచేసి, కార్పొరేటర్ల సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండు చేశారు. కోఆపరేటివ్ బ్యాంకు ఎన్నికలు కూడా దొంగ ఓట్లమయమేనన్నారు.

ఒకటి నుంచి కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 11: కపిలతీర్థంలోని కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 1వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు టీటీడీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఫిబ్రవరి 29వ తేదీన అంకురార్పణతో ఉత్సవాలు మొదలవుతాయి. ప్రతిరోజూ ఉదయం 7నుండి 9 గంటల వరకు, రాత్రి 7నుంచి 9 గంటల వరకు వాహన సేవలు ఉంటాయి. టీటీడీకి చెందిన హిందూధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రోజూ కోలాటాలు, భజనలు, అన్నమాచార్య ప్రాజక్టు ఆధ్వర్యంలో సంగీత కార్యక్రమాలు ఉంటాయని పేర్కొంది.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి

నాయుడుపేట, ఫిబ్రవరి 11: నాయుడుపేట మండలం మేనకూరు పంచాయతీ పరిధిలోని చలివేంద్ర గ్రామంలో ప్రభుత్వ భూములను కొందరు కబ్జా చేసి అక్రమంగా వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఆదివారం వారు మాట్లాడుతూ నాయుడుపేట - వెంకటగిరి రహదారికి ఇరువైపుల లక్షల రూపాయల విలువచేసే భూములను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ఈ విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు సర్వే నెంబరు 171-6లో హెచ్చరిక బోర్డు పెట్టారని, అయినా అక్రమ నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని చలివేంద్ర గ్రామస్తులు కోరుతున్నారు.

ధాన్యం ధరలు ధమాల్



ధరలు పడిపోతుండటంతో కల్లాల్లోనే ధాన్యాన్ని అమ్మేస్తున్న రైతులు

కోట, ఫిబ్రవరి 11: మొన్నటి వరకు మోస్తరుగా పలికిన ధాన్యం ధరలు ఆదివారం నుంచి తగ్గుముఖం పట్టాయి. పుట్టి ధాన్యంపై ఏకంగా 2వేల రూపాయలు తగ్గిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. బయట మార్కెట్‌లో బీపీటీ 5204(పెద్దజిలకర్లు) ధరలు పడిపోతున్నాయంటూ బ్రోకర్లు కారుచౌకగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేడు ఉన్న ధర రేపటికి ఉంటుందో లేదో అన్న అనుమానంతో రైతులు కల్లాల్లోనే ధాన్యాన్ని ఆఘమేఘాలపై అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. సముద్రతీర ప్రాంతాలైన కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో ఈ రబీ సీజన్‌లో రైతులు బీపీటీ 5204(పెద్ద జీలకర్లు) ఎక్కువగా సాగు చేశారు. పంటల కోతలు ప్రారంభమయ్యాక మొదట్లో ధాన్యం ధరలు పెరగడంతో రైతుల ఆనందపడ్డారు. మొన్నటి వరకు 5204 రకం ధాన్యం పుట్టి రూ.24,500 పలకగా ఆదివారం రూ.22,500లకు పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

దిగుబడులూ అంతంత మాత్రమే

పెళ్లకూరు: మండలంలోని బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638 రకాల వరికి అగ్గి తెగుళ్లతో పాటు దోమపోటు తెగుళ్లు ఆశించడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపింది. ఎకరాకు 40నుంచి 45 బస్తాల దిగుబడి వచ్చేది. ప్రస్తుతం దోమపోటు కారణంగా 25 నుంచి 30 బస్తాలు మాత్రమే దిగుబడి రావడంతో ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన రైతులు దిగాలు చెందుతున్నారు. మరోవైపు దళారులు ధాన్యానికి తగిన డిమాండ్ లేదంటూ తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

కాళంగి కలుషితం

- నది ఆనుకొనే డంపింగ్‌యార్డు
- నీటిలో కలుస్తున్న వ్యర్థాలు



కాళంగి నది ఒడ్డున డంప్ చేసిన చెత్త

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 11: వేలాది ఎకరాలకు సాగునీరందించే రైతుల వరప్రసాదిని కాళంగి నది కలుషితమైపోతోంది. ప్రఖ్యాతిగాంచిన షార్ కేంద్రం పక్కనే ఉన్న సూళ్లూరుపేట మున్సిపాలిటీకి డంపింగ్ యార్డు కరువైంది. దీంతో జాతీయ రహదారి పక్కనే కాళంగి నదిని ఆనుకొని చెత్త, వ్యర్థాలు డంప్ చేస్తున్నారు. మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో 45 వేలకు పైబడి జనాభా ఉంది. రోజుకు 65 టన్నులకు పైగా చెత్త పోగవుతోంది. రోజువారీ సేకరించిన ఎత్తను హోలీక్రాస్ సమీపంలోని జాతీయ రహదారి పక్కనే కాళంగి నదిని ఆనుకొని ఉన్న డంపింగ్ చేస్తున్నారు. ఈ చెత్త కాళంగిలో కలుస్తుండడంతో నది కలుషితమవుతోంది. అంతేకాకుండా అక్కడే చెత్తకు నిప్పుపెట్టడంతో పట్టణమంతా పొగ వ్యాపిస్తోంది. ఈ దుర్వాసనతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా పట్టణంలోని బోర్లు, బావుల్లో కూడా కలుషిత నీరు వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుమార్లు మున్సిపాలిటీ అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులకు పలుసార్లు మొరపెట్టుకొన్నా నేటికీ కార్యరూపం దాల్చలేదు.

రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి టీడీపీని గెలిపించండి



పోస్టర్లు విడుదల చేస్తున్న తెలుగు మహిళలు, యువత

గూడూరు, ఫిబ్రవరి 11: రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి ప్రతిఒక్కరూ టీడీపీని గెలిపించాలని తెలుగు మహిళలు, యువత నేతలు అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో తెలుగు మహిళలు, యువత ఆధ్వర్యంలో మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమం పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఈనెల 15వ తేదీలోపు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో అనేక పరిశ్రమలను ఏర్పాటు చేయడంతో పాటు ఐటీ రంగాన్ని ప్రోత్సహించి ఎన్నో లక్షలమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో మట్టం శ్రావణి, గుండాల లీలావతి, ప్రణీత్, సునీల్, సందీప్, కల్యాణ్, వెంకటసాయి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ల ధాటికి పగిలిన పైపులైన్

కోట, ఫిబ్రవరి 11: మండల పరిధిలోని గూడలి సంఘమేశ్వర ఆలయం సమీపంలో పైపులైన్ పగిలిపోవడంతో నీరంతా రోడ్డుపైకి చేరింది. పంచాయతీ అధికారులు స్థానిక స్వర్ణముఖినదిలో ఫిల్టర్‌పాయింట్లు వేసి పైపులైన్ ద్వారా గూడలితో పాటు ప్రకాశంకాలనీ వరకు సాగునీరు సరఫరా చేస్తున్నారు. చిట్టమూరు మండలం స్వర్ణముఖినది నుంచి ఇసుక టిప్పర్లు రాత్రంబవళ్లు అధిక లోడుతో ఈ మార్గంలో వెళ్తున్నాయి. ఇసుక టిప్పర్ల ధాటికి పైపులైన్ పగిలిపోయి నీరంతా రోడ్డుపైకి చేరింది.

కోటమ్మ ఆలయంలో నాగుపాము



పుట్టవద్ద దాగివున్న నాగుపాము

కోట, ఫిబ్రవరి 11: కోట గ్రామదేవత కోటమ్మ ఆలయ ప్రాంగణంలోకి ఆదివారం ఓ నాగుపాము హల్‌చల్ చేసింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నాగులపుట్ట ఉంది. ఆదివారం మహిళలు పుట్టవద్ద పూజలు చేస్తుండగా హఠాత్తుగా పాము ప్రత్యక్షమైంది. మొదట భక్తులు భయపడినప్పటికీ తరువాత నాగదేవతగా భావించి పూజలు చేశారు. కొంతసేపు అటు ఇటు తిరిగిన నాగుపాము భక్తుల వినకిడితో పుట్టలోకి వెళ్లిపోయింది.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు



హోమపూజలు నిర్వహిస్తున్న పండితులు

గూడూరు, ఫిబ్రవరి 11: స్థానిక బజారువీధిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు అగ్నిగుండ ప్రవేశం చేసిన రోజును పురస్కరించుకుని ఆలయ కమిటీ, ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి గణపతిపూజలు, వాసవీహోమం, అభిషేకాలు జరిపారు. భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బెదిరింపులపై ఫిర్యాదు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 11: పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో ఉన్న సంచారజాతులు(నక్కలోళ్ల) తమను ఓ నాయకుడు బెదిరిస్తున్నారంటూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాతబస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కన దుకాణాలు పెట్టుకొని జీవనం సాగిస్తున్న తమను బెదిరించడమేకాకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చెంగాళమ్మకు వెండి కిరీటం బహూకరణ



ఆలయ సిబ్బందికి కిరీటాన్ని అందజేస్తున్న శంకర్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 11: చెంగాళమ్మ పరమేశ్వరికి శ్రీకాళహస్తికి చెందిన కె.శంకర్ అనే భక్తుడు ఆదివారం 275 గ్రాముల వెండి కిరీటాన్ని బహూకరించారు. ఆదివారం ఆలయంలోని కార్యాలయ సిబ్బంది కామేశ్వరరావుకు కిరీటాన్ని అందజేశారు. ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి, కర్లపూడి సురేష్ పాల్గొన్నారు.

వ్యవసాయానికి కరెంట్ కోతలు

వాకాడు, ఫిబ్రవరి 11: మండలంలో వ్యవసాయానికి కరెంట్ కోతలు ప్రారంభమయ్యాయి. గత నాలుగు రోజులుగా అనధికారికంగా కరెంట్ కోతలు విధిస్తుండటంతో రైతులు అవస్థలు పడుతున్నారు. లోడ్ రిలీఫ్ కోసం రోజూ రెండు గంటల పాటు విద్యుత్ కోతలు అమలు చేయాలంటూ సబ్‌స్టేషన్లకు ఆదేశాలు అందినట్లు సమాచారం. స్వర్ణముఖి నదికి గంగజలాలు రాకపోవడంతో బోర్ల ద్వారా పొలాలకు నీరందించేందుకు ప్రయత్నిస్తున్న రైతులు కరెంట్ కోతలు ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ గౌస్‌మొహిద్దీన్ మాట్లాడుతూ పగటిపూటే 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తామన్న ప్రభుత్వం అనధికారికంగా కోతలు విధించడం సరికాదన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయండి

గూడూరు, ఫిబ్రవరి 11: వ్యవసాయ రంగానికి అందజేస్తున్న ఎటువంటి అంతరాయం లేకుండా 9గంటలు విద్యుత్ సరఫరా చేయాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి విద్యుత్ శాఖ డీఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆదివారం పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం 9గంటల విద్యుత్ సరఫరా ఇస్తామని చెప్పి కోతలు విధిస్తుండడం సరికాదన్నారు. అధికారులు స్పందించి రైతులకు 9గంటల విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

చెవిరెడ్డికి సన్మానం



డక్కిలి, ఫిబ్రవరి 11: ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ రీజనల్ కో ఆర్డినేటరుగా నియమితులైన చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ముప్పాళ్ళ సుబ్రహ్మణ్యం సన్మానించారు. ఆదివారం తిరుపతిలో చెవిరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బంద్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతూ రమణయ్య

గూడూరు, ఫిబ్రవరి 11: కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన నిర్వహించనున్న బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణయ్య అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆటో డ్రైవర్ల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిట్ అండ్ రన్ కేసుల్లో డ్రైవర్లకు పది సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేయాలన్నారు. అనంతరం ఆటో డ్రైవర్ల యూనియన్ పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహబూబ్‌బాషా, కార్యదర్శిగా కాలేషా, ఉపాధ్యక్షుడుగా కార్యక్రమంలో బాస్కర్, ట్రెజరర్‌గా ప్రసాద్, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఎం కార్యాలయంలో వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈనెల 16వ తేదీన నిర్వహించనున్న గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శివకుమార్, శశికుమార్, వెంకట్రామిరెడ్డి, బీవీ రమణయ్య, సురేష్, ప్రసాద్, గోపీనాథ్, కోటేశ్వరరావు, శంకరయ్య, మధు, శ్రీనివాసులు, ఉష, చంద్రయ్య, రాధాకృష్ణ, ప్రభాకర్, సీవీఆర్ కుమార్, భాస్కర్, శ్రీరాములు, చంద్రయ్య, నారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు కల్పించాలని ఆర్డీవోకు వినతి



ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

గూడూరు, ఫిబ్రవరి 11: డక్కిలి మండలం మోపూరు గ్రామంలో తాము సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కల్పించాలంటూ గిరిజనులు ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు విన్నవించారు. ఆదివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చిరంజీవి, వెంకటాద్రి, చెంగయ్య, గీత తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గ సభ్యులు

గూడూరు, ఫిబ్రవరి 11: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహబూబ్ బాషా, ప్రధానకార్యదర్శి మోహన్, కోశాధికారిగా కృష్ణయ్య, అసోసియేట్ అధ్యక్షులుగా బాస్కర్‌రావు, పురుషోత్తమరావు, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా గోపాల్, సహాయ ఎన్నికల అధికారిగా చెంగల్‌రాయులు, పర్యవేక్షులుగా లక్ష్మీనారాయణ, జయరామనాయుడు, కృపావరమ్మ వ్యవహరించారు.

వైసీపీ విజయానికి కృషి చేయండి

గూడూరు, ఫిబ్రవరి 11: రానున్న ఎన్నికల్లో వైసీపీ గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని రామలింగాపురం, మిటాత్మకూరు, సంతదాసుపల్లి, విందూరు తదితర గ్రామాల్లో నాయకులను కలిసి పార్టీ విజయానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, చేవూరు విజయ్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అల్పాహారం అందజేత

వెంకటగిరి, ఫిబ్రవరి 11: పట్టణంలోని నిరుపేదలకు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు స్వామి వివేకానంద యువసైన్యం ఆధ్వర్యంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతికుమార్ అల్పాహార ప్యాకెట్లు, మినరల్ వాటర్ బాటిళ్లు అందజేశారు. కార్యక్రమంలో స్వామి వివేకానంద యువసైన్యం సభ్యులు సోమాల భాస్కర్‌రాజు, చిన్నమద్దెల గోపీనాద్, దొందోలు శ్రీనివాసులు, అఖిల్, కోటేశ్వరావు, మునికుమార్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

మర్లపల్లిలో 'పల్లెకు పోదాం'

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 11: మండలంలోని మర్లపల్లి గ్రామంలో ఆదివారం బీజేపీ నాయకులు ఏపీఎస్ రవీంద్ర ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గురుప్రసాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకాండ పారాయణంతో మార్మోగిన తిరుమల గిరులు

తిరుమల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల నాదనీరాజనం వేదికపై ఆదివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఏడవ విడత అయోధ్యకాండ అఖండ పారాయణంతో తిరుమలగిరులు మార్మోగాయి. 22 నుంచి 25 సర్గల వరకు 155 శ్లోకాలను పారాయణం చేశారు. యోగవాశిష్టం-ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు పారాయణం చేశారు. వేదపండితులు అఖండ పారాయణం చేయగా భక్తులు వారిని అనుసరించారు. ధర్మగిరి వేదవిజ్ఞానపీఠానికి చెందిన ప్రముఖ పండితులు శేషాచార్యులు, అనంత, మారుతి, ధర్మగిరి వేదపాఠశాల, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థకు చెందిన వేద పారాయణదారులు, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన పండితులు పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన నాగరాజు బృందం రామనామ సంకీర్తన, అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుడు రఘునాథ్ బృందం 'పాహిరామ ప్రభో, పాహిరామ ప్రభో' సంకీర్తనను ఆలపించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.51 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.51 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 70,158 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

రోడ్డు కోసం పార్టీలకతీతంగా కదలిరండి

వేనాడు దీవిలో గ్రామస్తుల తీర్మానం



వేనాడులో రోడ్డుపై బైఠాయించి నిరసన చేస్తున్న యువకులు

తడ, ఫిబ్రవరి 11: 'మన గ్రామానికి తారురోడ్డు సౌకర్యం కోసం అందరూ కదలి రండి... అంటూ ఆ గ్రామ యువకులు ఇచ్చిన పిలుపుకు అందరూ కదిలివచ్చారు. మాకు రోడ్డు ముద్దు.. పార్టీలు వద్దు.. రోడ్డు వేస్తేనే ఓటు వేస్తాం... అంటూ వేనాడు పంచాయతీలోని వేనాడు, పల్లిపేటకుప్పం, మూల, ఆలాపత్రి, మట్టిగుంట, మొక్కపెళ్ల సెంటర్ గ్రామస్తులు తీర్మానం చేశారు. తడ మండలంలోని వేనాడు దీవిలోని ఆరు గ్రామాల గ్రామస్తులతో పాటు పార్టీలకతీతంగా నాయకులతో కలిసి యువత వేనాడు గ్రామంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఇందులో టీడీపీ, వైసీపీ నాయకులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ అందరూ కలిసి పార్టీలను పక్కన పెట్టి తారురోడ్డు నిర్మాణం కోసం పోరాటాం చేస్తామని పిలుపునిచ్చారు. ఈ మేరకు కరపత్రాలు, పోస్టర్లు పలుచోట్ల అతికించారు. అనేక నిబంధనలతో తమ గ్రామాలకు తారురోడ్డు లేక అవస్థలు పడుతున్నామని, ఇందుకు అందరూ కలిసి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని ముందుకొచ్చారు. తమ గ్రామానికి తారురోడ్డు సౌకర్యం కల్పించకపోతే, ఓటు వేయబోమని, అవసరమైతే ఎన్నికలు కూడా బహిష్కరిస్తామని అల్టిమేటం చేశారు. దాదాపు వెయ్యి మందికి పైగా ఈ సమావేశానికి విచ్చేసి అందరూ ఒకే బాట.. ఒకే మాటలో పయనించి తారు రోడ్డు నిర్మాణం సాధించుకోవాలని తీర్మాణం చేశారు. మన పోరాటంలో ఎవర పార్టీలకు తొత్తుగా వ్యవరించవద్దని అందరూ కలిసి ముందుకు సాగుతామన్నారు. ముందుగా గ్రామాల్లో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించి వేనాడు దర్గా వద్దకు చేరుకొని అక్కడ రోడ్డు పై బైఠాయించి నిరసన తెలిపారు.